జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 19 విశాఖపట్నం ఆదివారం 03 అక్టోబరు 2021 8 పేజీలు వెల : 5.00

## ప్రతిపక్షాలది..

# రాజకీయ వంచన: మోదీ



న్యూఢిల్లీ,అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: కొత్త సాగు చట్టాలను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలు రాజకీయ నయవంచనకు పాల్పడుతున్నాయని, మేధోపరమైన నిజాయితీ కొరవడిందని దుయ్యబట్టారు. ప్రజలు దశాబ్దాల క్రితం పొందవలసిన ప్రయోజనాలను ఇప్పుడు అందజేసేందుకు కఠిన నిర్ణయాలు అవసరమన్నారు. రాజకీయ పార్టీలు వాగ్దానాలు చేసి, వాటిని నెరవేర్చకపోవడం ఒక తరహా అన్నారు. అయితే ముఖ్యంగా అవాంఛనీయమైనది, అసహ్యకరమైనది ఏమిటంటే, తన ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల తరహాలోనే కొన్ని రాజకీయ పార్టీలు వాగ్దానాలు చేశాయన్నారు. అవే పార్టీలు ఇప్పుడు యూ-టర్న్ తీసుకున్నాయన్నారు. ఆ పార్టీలు చేసిన వాగ్దానాలపై హానికరమైన తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తున్నాయన్నారు. తమకు అర్హతగల, దశాబ్దాల క్రితం పొందవలసిన ప్రయోజనాలను భారతీయులు ఇప్పటికీ పొందలేకపోతున్నారన్నారు. ఈ దేశం, ప్రజలకు అర్హతగలవాటి కోసం ఇంకా ఎదురు చూడవలసిన పరిస్థితిలో దేశాన్ని ఉంచకూడదన్నారు. వాటిని వారికి ఇవ్వాలన్నారు. దీని కోసం భారీ నిర్ణయాలను తీసుకోవాలన్నారు. అవసరమైతే కఠిన నిర్ణయాలను కూడా తీసుకోవాలన్నారు. కొత్త సాగు చట్టాల్లో ఫలానా అంశాన్ని మార్చాలని నిర్దిష్టంగా ఎవరూ చెప్పడం లేదన్నారు. భారత దేశంలో రాజకీయాలు కేవలం ఒక విధానాన్నే చూస్తున్నాయన్నారు. తదుపరి ప్రభుత్వాన్ని కూడా తామే నడపాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. కానీ తన మౌలిక ఆలోచన దీనికి భిన్నమైనదని చెప్పారు. దేశాన్ని నిర్మించడానికే ప్రభుత్వాన్ని నడపాలనేదానిని తాను నమ్ముతున్నానని చెప్పారు. "మీ పార్టీని (మిగతా 2లో..)



## బహుజనుల ఆర్థిక స్వావలంబనే..

# లక్ష్యంగా స్నేహా మ్యాక్స్....

- లాభాలను చారిటీ పనులకు ఉపయోగిస్తున్న ఏకైక సంస్థ స్నేహా...
- వికేంద్రీకరణ, పారదర్శకతలే సంస్థపై బహుజనుల నమ్మకానికి తార్కాణాలు.
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నియామక వర్క్‌షాప్‌లో స్నేహా సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు

హైదరాబాద్(ప్రజాపాలన సిటీ బ్యూరో) :పే బ్యాక్ టు సొసైటీ అన్న నినాదంతో 2001 లో స్థాపించిన స్నేహా క్లబ్ అంచెలంచెలుగా ఎదిగి వందల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం ఆనందదాయకంగా ఉందని అన్నారు స్నేహా సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన స్నేహా మ్యాక్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో మొత్తం 25 విలేజ్ లను దత్తత చేసుకుని వారి అభ్యున్నతికి స్నేహా సంస్థలు పాటుపడుతున్నాయన్నారు.అక్కడ ముఖ్యంగా గమనించిన సమస్యలలో బహుజనులు అప్పులు తీసుకుని పడుతున్న ఇబ్బందులు గమనించి స్థాపించినదే స్నేహా మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ అన్నారు. మేమెంతో మాకంత మీరెంతో మీకంత అన్న ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలన్నదే స్నేహా సంస్థల అభిమతం అన్నారు. బహుజన బ్యాంకు లో అందరూ భాగస్వాములే అన్న కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ని 119 నియోజకవర్గాలలో 119 మందిని మ్యాక్స్ తరవున ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ఎంప్లాయి ని నియమిస్తున్నామని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పిలువబడే వీరికి వయసు తో సంబంధం లేకుండా బహుజనులను నియమించడం జరుగుతోంది అన్నారు. ఒక సంవత్సరం తరువాత పర్మినెంట్ అవుతుందని, బహుజనులు అభివృద్ధి చెందాలంటే ఆర్థిక వెసులుబాటు ముఖ్య మన్నారు.మన కష్టార్జితంతో మన సంస్థలు మనమే నిర్మించుకుందామన్నారు. స్నేహా సంస్థల లో అన్నీ వికేంద్రీకరణ పద్ధతిలో పారదర్శకంగా ఉండేలా స్థాపించిన వే అని అన్నారు. (మిగతా 2లో..)

## జగన్ చేతుల మీదగా...

# క్లాప్ కార్యక్రమం ప్రారంభం





అమరావతి, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: గ్రామీణ, పట్టణ, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన 'క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమాన్ని గాంధీ జయంతి సందర్భంగా శనివారం విజయవాడ బెంజి సర్కిల్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం సీడీని ఆవిష్కరించారు. 4,097 చెత్త వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యకరమైన పరిసరాల్లో ఆహ్లాదంగా గడపాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం?. క్లాప్‌కార్యక్రమంలో భాగంగా బిన్ ఫ్రీ, లిటర్ ఫ్రీ, గార్బేజ్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే జాతీయస్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఉత్తమ ర్యాంక్ సాధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 100 రోజులపాటు జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కొనసాగనుంది.

**1.20 కోట్ల డస్ట్ బిన్‌ల పంపిణీ**

గృహాల్లోనే తడి, పొడి, ప్రమాదకర (నాప్‌కిన్స్, సూదులు, గ్లాజ్‌లు, ఎలక్ట్రికల్) చెత్తను వేరు చేసేలా ప్రతి ఇంటికి మూడు డస్ట్ బిన్‌ల చొప్పున క్లాప్ కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీల్లో ప్రభుత్వం పంపిణీ చేయనుంది. 123 (మిగతా 2లో..)



## మహాత్మాగాంధీకి జగన్ ఘన నివాళి

అమరావతి, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: నేడు జాతిపిత మహాత్మాగాంధీ 152వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాపూజీకి ఘన నివాళులు అర్పించారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారానికి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో రెండేళ్ల కిందటే అడుగులు పడ్డాయని అన్నారు. నేటి నుంచి క్లీన్ ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. మహాత్ముడి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అంటూ ట్వీట్ చేశారు.

## తొక్కే కొద్దీ పైకిలేస్తాం తప్ప..

# తగ్గేది లేదు..

### రాష్ట్ర రాజకీయాలు రెండిళ్ల మధ్య జరిగితే కుదరదు: పవన్



రాజమండ్రి, :అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: ఆఖరి శ్వాస వరకూ రాజకీయాల్లోనే ఉంటానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఈ పోరాటంలో తాను ప్రాణాలు కోల్పోతే.. తన మట్టిని దేశం నలుమూలలా చల్లాలంటూ జనసైనికులకు పిలుపునిచ్చారు. జనసేన తలపెట్టిన శ్రమదానం' కార్యక్రమాన్ని పవన్ కల్యాణ్ పూర్తి చేశారు. రాజమహేంద్రి ఎయిర్‌పోర్టు నుంచి మొదలుకుని.. బహిరంగ సభ ప్రాంగణానికి వెళ్లేంత వరకూ అడగడుగునా పోలీసులు అడ్డంకులు సృష్టించారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయి 'ఎలా అడ్డుకుంటారో చూద్దాం.. శ్రమదానం చేసి తీరుతాం.. సభ నిర్వహించే ఇక్కడ్నుంచి కదులుతాం' అంటూ పోలీసులకు సవాల్ విసిరారు. మరోవైపు.. అభిమానులు, కార్యకర్తలు ఏ మాత్రం తగ్గకుండా భారీగానే సభకు తరలివచ్చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ప్రశ్నించే వాడంటే అధికార పక్షానికి భయం పట్టుకుందన్న పవన్.. అందుకే నేనంటే వైసీపీ భయమన్నారు. ప్రశ్నించాలంటూ మొదట్నుంచీ నేను ప్రజలను మొత్తుకునేది అందుకేనన్నారు పవన్ కల్యాణ్. సరదా కోసం రాజకీయాల్లోకి రాలేదన్నారు జనసేనాని. తనకు అన్నం పెట్టిన ప్రజల రుణం తీర్చుకోవడానికే (మిగతా 2లో..)



## ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు: దుర్గగుడి చైర్మన్

అన్నపూర్ణ మ్యారేజెస్ - అన్ని కులాల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును ప్రవేశం ఉచితం%ఫోన్: 9397979740/50

%విజయవాడ: అక్టోబర్ 7 నుంచి 15 వరకు ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దుర్గగుడి చైర్మన్ పైలా సోమినాయుడు తెలిపారు. రోజుకు పదివేల మంది భక్తులకు ఆన్‌లైన్ స్లాట్ ద్వారా మాత్రమే దుర్గమ్మ దర్శనానికి అనుమతిస్తామన్నారు. నాలుగు వేల మందికి ఉచిత దర్శనం, మూడు వేల మందికి 300 రూపాయల టిక్కెట్ దర్శనం, మరో 300 మందికి 100 (మిగతా 2లో..)

bahujan bazaar బహుజన్ బజార్ bahujan bazaar
www.bahujanbazaar.in



మిత్రులందరికీ జై భీం,

మన పోరాట యోధురాలు ఝల్‌కరీ భాయీ చరిత్రను వక్రీకరించి ఝాన్సీలక్ష్మి భాయి చరిత్రను మన చేత ప్రచారం చేయించిన విషయం మీకు తెలుసు దీనికీ కారణం మన రచయితలను మనం ప్రోత్సహించకపోవడం. అదేవిధంగా మన రచనలు ప్రతి ఊరులో అందుబాటులో లేకపోవడం వల్ల మన బహుజన వాదం వెనుకబడుతున్న విషయం కూడా మన అందరికి తెలుసు

అందువల్ల బహుజన రచనలను అన్నింటిని మీరు ఆర్డరు చేసిన వెంటనే మీకు అందించే విధంగా చేద్దాం. బహుజన రచయితలను ఆర్థికంగా బలోపేతం చేయడం వల్ల మన చరిత్రలను వెలికితీసే విధంగా చేద్దాం. పుస్తకాలను కొనండి, చదవండి, హాస్టల్ పిల్లలకు బహుమానం ఇవ్వండి.

లాభాలు

- అన్ని ప్రాంతాలు తిరుగకుండా ఇంటినుండే కొరుకున్న పుస్తకాన్ని ఇంటివద్దకు తెప్పించుకోవడం సులువవుతుంది. తద్వారా సమయం డబ్బు ఆదా అవుతుంది.
- మనవాళ్ళ బహుజన చరిత్ర తెలుసుకోవడం బహుజనాభివృద్ధికి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలల్లో తగిన విధంగా అవగాహనకు అవకాశం ఉంటుంది.
- బహుజనులకు సంబంధించిన రచయితలు ఎవరెవరు ఎక్కడ ఉన్నారు ఏమేమి రచయినలు చేసారో సులభంగా ఒకేచోట తెలుస్తుంది.
- బహుజన రచయితలు ఆర్థికంగా బలపడటం వల్ల పరిశోధనాత్మకత అభివృద్ధి (Research and Development) సాధ్యం అవుతుంది.

ఉచితం: రూ. 1000/- తో సభ్యత్వం తీసుకున్నవారికి సంవత్సర కాలములో పుస్తకాల రవాణా ఖర్చులు ఉచితం.
రూ. 500/-లకు పైన కొనగోలు చేసే పుస్తకాలపై కూడా రవాణా ఖర్చులు ఉచితం.

ప్రతి యొక్క బహుజనుడు కనీసం ఒక పుస్తకాన్ని కొని హాస్టల్ పిల్లలకు ఉచితంగా ఇచ్చి బహుజనాభివృద్ధి తోడ్పడండి.

జై భీం, జై ఫూలే, జై బహుజన

డాక్టర్ కె. శివ భాగ్యారావు బహుజన IRS-VRS
చైర్మన్, స్నేహ గ్రూప్స్





## బహుజనుల ఆర్థిక స్వావలంబనే..

# లక్ష్యంగా స్నేహా మ్యాక్స్...







(మొదటి పేజీ తరువాయి)

**ప్రొఫెసర్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ..**

మొదట్లో సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో ని విద్యార్థుల కష్టనష్టాలను,అవసరాలను తీర్చేందుకు ప్రారంభమైన స్నేహా సంస్థల ప్రయాణం ఒక సమూహంగా మారి నేడు 16 సంస్థల స్నేహా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ గా మారిందన్నారు. సోషల్ ఇంజనీరింగ్ పద్ధతిన బహుజనులందరినీ అభివృద్ధి చేసి సంస్థ ఉన్నతిలోకి రావడమే సంస్థ లక్ష్యం అన్నారు.

**నేరేళ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ..**

కష్టపడితేనే ఫలితం ఉంటుందన్న సూక్తిని నూతనంగా నియమితులైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లు తెలుసుకోవాలని ఇట్టి అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

**ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ..**

సంస్థ అంచెలంచెలుగా ఎలా ఎదిగిందన్నది స్నేహా సంస్థ గ్రాఫ్ చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల కంటే ప్రైవేట్ రంగ సంస్థలే నేడు మెరుగ్గా పనిచేస్తున్నాయన్నారు.ఐ ఆర్ ఎస్ లాంటి ఉన్నతమైన పదవి వదులుకొని శివ భాగ్యారావు నేడు స్నేహా సంస్థల ను ఇంత గొప్ప స్థాయికి తీసుకొచ్చారని అన్నారు. ఒక ప్రణాళిక బద్ధంగా దీర్ఘకాలిక ఆలోచనలతో నడుస్తున్న సంస్థలు ఎప్పుడూ అభివృద్ధి బాటలోనే ఉంటాయని అందుకు ఉదాహరణ స్నేహా సంస్థలే అన్నారు. తాము ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ సంస్థ అభివృద్ధి కి తోడ్పాటు అందించాలని నూతనంగా నియమితులైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లకు సూచినారు.

**ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..**

ఏ సంస్థ కైనా ఆర్థిక వనరులు ముఖ్యమని వాటిని సమకూర్చే బాధ్యత బహుజనులదే అన్నారు. ఈ సంస్థ నాదే అన్న భావన తో పనిచేస్తేనే సంస్థ అభివృద్ధి కి దోహద పడినట్లు అవుతుందని,అటువంటి సంస్థలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తేనే బహుజనుల రాజ్యాధికారం కల సాకారం అవుతుందని తెలిపారు.

**బి.ఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ..**

ధనం మూలం ఇదం జగత్ అన్న విధంగా సమాజం నడుస్తున్నదని, బహుజనులను ఆర్థికంగా పరిపుష్టం చేయడం ద్వారా స్నేహా సంస్థలు బహుజనుల అభివృద్ధి కి బాటలు వేస్తున్నాయన్నారు. డిపాజిటర్లతో తరచూ ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా వారిలో నమ్మకాన్ని పెంచిన వారమవుతామన్నారు.

**రవిప్రసాద్ మాట్లాడుతూ..**

బహుజన హితాయ, బహుజన సుఖాయ అణా బుద్ధ సూక్తితో, మైత్రి భావనతో తాము అభివృద్ధి చెందుతూ సంస్థ కు తోడ్పాటు అందించాలని అన్నారు.

**ఎక్సోటిక్ ఈవెంట్స్ సంస్థ అధినేత కె కె రాజా మాట్లాడుతూ..**

20 సంవత్సరాలుగా స్నేహా సంస్థలు అందిస్తున్న సేవలు బహుజనులందరికీ గర్వకారణం అన్నారు. ఒక కంపెనీ లాభాలను చారిటీ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న సంస్థ ఒక్క స్నేహా మాత్రమే అన్నారు. బహుజనులకు ఒక టి వి ని,దినపత్రిక ను ఏర్పాటు చేశారన్నారు.

**స్నేహా గ్రూప్ ఎండి క్రాంతి కుమార్ మాట్లాడుతూ..**

స్నేహా సంస్థల ఆశయం బహుజనులందరు ఐక్యంగా కలిసి వారి అభివృద్ధిని వారే నిర్ణయించుకోవడం,వారి ఆర్థికాభివృద్ధి వారి చేతుల్లోనే ఉండేలా చేయడం అందుకొరకు పారదర్శకంగా పనిచేయడం అన్నారు.

**పద్మాశర్మ మాట్లాడుతూ..**

కుల రహిత సమాజం కొరకు పాటుపడుతున్న స్నేహా సంస్థల లో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. మన ఆర్థికాభివృద్ధి మన చేతుల్లోనే ఉండేలా నమ్మకంగా పనిచేస్తున్న స్నేహా సంస్థ లలో డిపాజిట్ లు చేయాలన్నారు.

**మ్యూస్టర్ కీ టివి ఎండీ జె బి రాజు మాట్లాడుతూ...**

బహుజనులు ఉన్నత స్థాయిలో అధికారులు కాగలుగు తున్నారంటే అది ఒక్క అంబేద్కర్ చలువే అన్నారు. స్నేహా సంస్థలను ఇన్ని సంవత్సరాలుగా నమ్మకంగా నడుపుతున్న శివ భాగ్యారావు ఉన్నతమైన వ్యక్తిత్వం గల వాడన్నారు. పారదర్శకంగా డిపాజిటర్లకు లాభాలను అందిస్తున్న స్నేహా మ్యాక్స్ వంటి సంస్థలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని కితాబిచ్చారు. పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా, వేలాదిమంది జీవితాలను బాగు చేస్తూనే,బహుజనుల రాజ్యాధికారం కొరకు పాటుపడటం స్నేహా సంస్థల ప్రత్యేకత అన్నారు. ఇంత గొప్పగా బహుజనులకు గత రెండు దశాబ్దాలుగా సేవ చేస్తున్న సంస్థ స్నేహా అని ఇది శివ భాగ్యారావు సమర్థతకు తార్కాణం అన్నారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ లకు,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లకు తాము నిర్వహించబోయే కార్యకలాపాలను వివరించారు. డిపాజిట్ ల సేకరణ లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లకు కొన్ని సూచనలు చేశారు. కేవలం 20 రూపాయల తో ప్రతీ ఒక్క బహుజనుడికి మ్యాక్స్ లో సభ్యత్వం కల్పిస్తున్నామన్నారు. నూతనంగా నియమితులైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ల సందేహాలను అడిగి తెలుసుకుని నివృత్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు డైరెక్టర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్నేహ మ్యాక్స్ ప్రెసిడెంట్ రామకృష్ణ, డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.






## వరుణ్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో.. వృద్ధుల కోసం ఉచిత వైద్య శిబిరం



విశాఖపట్నం, అక్టోబర్ 2, (ప్రజాపాలన బ్యూరో ) :నవరత్నం - కేశవరావు చారిటబుల్ ట్రస్ట్..వరుణ్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో విశాఖ, వన్టౌన్లో ఉన్న వివేకానంద అనాథ ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం జరిగిందిడాక్టర్ బంగార్రాజు వైద్యబృందం అనాథ ఆశ్రమంలో ఉన్న వృద్ధులతో పాటు స్థానిక వృద్ధులకు కూడా బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు..రక్త పరీక్షల నివేదిక అనంతరం వారికి మందులు ఉచితంగా అందచేశారు.పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించడంలో.. నవరత్నం - కేశవరావు చారిటబుల్ ట్రస్ట్, వరుణ్ హెల్త్ సెంటర్ విశేషంగా కృషి చేస్తోందని డాక్టర్ బంగార్రాజు అన్నారు.వేలాది మంది నిరుపేదలకు..వైద్య సేవలు అందించామని డాక్టర్ బంగార్రాజు ఆన్నారు.

## ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహొత్సవాలు: దుర్గగుడి చైర్మన్

(మొదటి పేజీ తరువాయి)

రూపాయల దర్శనం కేటాయించామని ఆయన తెలిపారు. మూలా నక్షత్రం రోజున పది వేల మంది భక్తులను పెంచే దానిపై నిర్ణయిస్తామన్నారు. తొలిరోజు స్నపనాభిషేకం అనంతరం 9 గంటల నుంచి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. 11వ తేదీన రెండు అలంకారాల్లో దుర్గమ్మ దర్శనమివ్వనున్నారు. ఉదయం అన్నపూర్ణాదేవి అలంకారంలో, మధ్యాహ్నం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 12 మూలానక్షత్రం రోజున దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సీఎం జగన్ సమర్పించనున్నారు. దసరాలో ఉదయం 3 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు దుర్గమ్మ దర్శనం ఉంటుందన్నారు. మూలానక్షత్రం రోజు తెల్లవారుజామున వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దుర్గమ్మ దర్శనం ఉంటుదని తెలిపారు. 7 వ తేదీన తొలిరోజు దుర్గమ్మ శ్రీ స్వర్ణకవచాలంక్రుత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తారని ఆయన పేర్కొన్నారు. వీఐపీలు ఖచ్చితంగా స్లాట్ లేదా కరెంటు బుకింగ్ ద్వారా టిక్కెట్ తీసుకోవాల్సిందేనని సూచించారు. ఈ ఏడాది కోటి రూపాయలుతో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

## టీచర్ పున్నయ్యను అభినందించిన శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ లత్కార్



విశాఖపట్నం, అక్టోబర్ 2, (ప్రజాపాలన బ్యూరో ) :శ్రీకాకుళం నగర పాలక సంస్థ బలగ పాఠశాలలో పనిచేస్తున్న జీవ శాస్త్ర ఉపాధ్యాయులు ఎ. పున్నయ్యనుజిల్లా కలెక్టర్శ్రీ కేష్ బి. లత్కార్ ఘనంగా సన్మానించారు.జవహర్ లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్సడ్ సైంటిఫిక్ రీసెర్చ్ బెంగళూరుకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయం రెండు అవార్డులను ప్రకటించింది.2019 సంవత్సారానికి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన" అవుట్ స్టాండింగ్ సైన్స్ టీచర్స్ ప్రైజ్" రెండింటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్,శ్రీకాకుళం బలగ నగరపాలక ఉన్నత పాఠశాల జీవశాస్త్రఉపాధ్యాయులు ఎ.పున్నయ్య కు గత నెల 23న సియన్ రావు కాన్ఫరెన్స్ హాల్ లో వర్చువల్ విధానం లో అరుదైన అవార్డును ప్రధానం చేశారు. జిల్లాకలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ తన చాంబర్ లో పున్నయ్యను అభినందించి,ఘనంగా సన్మానం చేశారు. శ్రీ కాకుళం నగర పాలక సంస్థ కమీషనర్ చల్లా ఓబులేసు, జాతీయ స్థాయిలో శ్రీకాకుళంనగర పాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎంపికైనందుకు పున్నయ్య ను అభినందిస్తూ, ప్రశంసించారు. జిల్లా విద్యా శాఖ అధికారి పగడాలమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వి.మురళీక్రిష్ణ, పి.యం.సి.చైర్మెన్స్వామి నాయుడు పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ఘనంగా గాంధీ జయంతి ఉత్సవం

**అమ్మ వయో వృద్ధుల విశ్రామ నిలయం ప్రారంభం -చిరు వ్యాపారస్థులకు గొడుగులు వితరణ -అమ్మ వయో వృద్ధుల విశ్రామ నిలయంలో చెట్లు నాటడం.**



అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: గాంధీ జయంతి సందర్భంగా "అమ్మ వయో వృద్ధుల విశ్రాంతి ఆశ్రమం " ప్రారంభోత్సం శ్రీమతి పాటిల్ సరోజమ్మ చేతులు మీదుగా ఏర్పాటు చేసినట్లు శ్రీ ఎం. విరూపాక్ష రెడ్డి తెలిపారు. ఈ విశ్రాంతి ఆశ్రమం వయోజన వృద్ధులకు, అనారోగ్యంతో బాధపడేవారికి ఏర్పాటు చేయడమైనది. నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు మరియు సీనియర్ సిటిజన్లకు కులం, మతం మరియు లింగ వివక్ష లేకుండా సంరక్షణ అందించడం ఈ ఆశ్రమం ముఖ్య ఉద్దేశం. వృద్ధులకు వృద్ధాప్య సేవలను అందించడానికి. ఏదైనా స్వచ్ఛంద సహాయాన్ని, అవసరమైనప్పుడు మరియు అవసరమైనప్పుడు అర్హులైన వ్యక్తులకు అందించడానికి. ఏదైనా స్వచ్ఛంద సంస్థలు లేదా స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు మరియు యువతతో ఏదైనా ప్రాజెక్టును నిర్వహించడానికి, ఇది సీనియర్ సిటిజన్లకు ప్రయోజనకరంగా ఉంటుంది. రాబోయే రోజులల్లో కమిషినర్ ఫార్ డిజాబిలిటీస్ ద్వారా పర్మిషన్ వస్తే శారీరకంగా మరియు మానసికంగా వికలాంగులకు సంరక్షణ అందించడానికి పరిమితి సంఖ్యలో కార్యక్రమాలు చేయనున్నట్లు డా ఎం. సురేష్ బాబు తెలిపారు. అమృత్ టాకీస్ దగ్గర చిరు వ్యాపారస్థులకు గొడుగులు వితరణ చేశారు కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఎలైట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి - ఇంజినీర్ సత్యనారాయణ, వైష్ణవ శ్రీనాథ్, రుఖియా బేగం, రియాజ్, బి. నాగేంద్ర ప్రసాద్, లయన్ జిలాన్ ఖాన్, మక్బుల్ మరియు గుత్తి లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీ చైతన్య తదితరులు పాల్గొన్నారు. వంద పండ్ల మొక్కలను వృద్ధాశ్రమ ప్రాంగణంలో నాటారు.

## ఘనంగా కీ.శే.డా. గోపాలరావు సేవలు మరువలేనివి: మచిలీపట్నం పార్లమెంటరీ బి.సి సంక్షేమ శాఖ అధ్యక్షులు అందె జగదీష్



**ఘంటశాల,** అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: సంఘసేవకులు, అనుక్షణం సమాజ శ్రేయస్సుకే పరితపించిన కీ..శే. డా. గుత్తికొండ గోపాలరావు సేవలు అభివనందనీయమనీ మచిలీపట్నం పార్లమెంటరీ బి.సి. సంక్షేమ శాఖ అధ్యక్షులు అందె జగధీష్ అన్నారు. చినకళ్ళేపల్లిలోని గుత్తికొండ గోపాలరావు ప్రశాంత నిలయంలో 76 జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అందె జగదీష్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం గాంధీజీ ఆశయాలను సిద్దింప చేయటం కొరకు సమాజంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి విశేష కృషి చేశాడనీ కొనియడారు. మోర్ల మహిధర్, ఆయన సతీమణి కొకిలాంభ (గీతామాత), రాష్ట్ర బి.సి.నాయకులు ఆత్కూరి సీతారామరాజు, జి. సత్యన్నారాయణ, శీలం నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## రాజకీయ వంచన: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

గెలిపించుకోవడానికి ప్రభుత్వాన్ని నడిపే సంప్రదాయం ఉండేది. కానీ దేశాన్ని గెలిపించే విధంగా ప్రభుత్వాన్ని నడపాలనేది నా ఉద్దేశం" అని తెలిపారు. కొత్త సాగు చట్టాల అమలును ప్రస్తుతం నిలిపేశారు. ఈ చట్టాలను రద్దు చేయాలని, కనీస మద్దతు ధర విధానాన్ని కొనసాగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో గత ఏడాది నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### గాంధీకి నివాళులర్పించిన ప్రధాని మోదీ..

మహాత్మా గాంధీ 152వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. శనివారం ఉదయాన్నే ప్రధాని మోదీ రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. ఆయనతోపాటు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా గాంధీకి నివాళులర్పించారు. వారితోపాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ తాత్కలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా రాజ్‌ఘాట్‌కు చేరుకుని బాపూజీకి నివాళులర్పించారు. అనంతరం ప్రధాని మోదీ విజయ్ ఘాట్‌కు చేరుకుని మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు.

## తొక్కే కొద్దీ పైకిలేస్తాం తప్ప.. తగ్గేది లేదు..

(మొదటి పేజీ తరువాయి)

పాలిటిక్స్‌లోకి వచ్చానన్నారు. ప్రజల కోసమే నేను తిట్టు తింటున్నా. నా కోసమైతే ఎప్పుడో వాళ్ల తోలు తీసేవాడినన్నారు పవన్ కల్యాణ్. ఇక, తిడితే ఊరుకునేది లేదన్న జనసేనాని.. ఆడైనా మగయినా సరే తోలు తీస్తానంటూ వార్నింగ్ ఇచ్చారు.

రాష్ట్ర రాజకీయాలు రెండిళ్ల మధ్య జరిగితే కుదరదన్న పవన్.. ఒక కులాన్ని వర్గ శత్రువుగా చేసుకుని వైసీపీ రాష్ట్రాన్ని నాశనం చేసిందని ఆరోపించారు. అందుకే రోడ్లు లేవు, జీతాలు పెన్షన్లు రావని ఎద్దేవ చేశారు. బైబిల్ చేత్తో పట్టుకుని తిరిగే వాడిని కాదు, గుండెల్లో పెట్టుకుంటానన్నారు. కాపు, ఒంటరి, తెలగలు, బలిజలు ముందుకు వస్తే తప్ప రాష్ట్ర రాజకీయాల్లో మార్పు రాదని సూచించారు. నాలుగు కులాలు పెద్దన్న పాత్ర పోషిస్తే తప్ప మిగిలిన కులాలకు సాధికారిత రాదని హితవు పలికారు. దుష్టపాలన అంతం కావాలంటే ప్రతి ఒక్కరూ ఏకం కావాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యంగా పనులు జరగడం లేదని పవన్ ఆరోపించారు. దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం మన హక్కు. పనులు జరగనప్పుడు ప్రశ్నించే హక్కు ఉంది. రాజ్యాంగం కల్పించిన హక్కును ఎవరూ అడ్డుకోలేరన్నారు. ప్రజలకు ఉన్న హక్కును ఎవరూ ఆపలేరు. తొక్కే కొద్దీ పైకిలేస్తాం తప్ప.. తగ్గేది లేదని స్పష్టం చేశారు. రాజకీయాలు నాకు సరదా కాదు.. బాధ్యత. నేను సీఎం కావాలని మనసులో కోరుకోండి. రాజకీయాలు నాకు వ్యాపారం కాదు. త్వరలోనే అధికారంలోకి వస్తామని వెల్లడించారు. పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేయడం సరికాదని హితవు పలికి పవన్ కళ్యాణ్.. రాజకీయ పార్టీ నడపడం అంత సులువు కాదని జనసేనాని చెప్పుకొచ్చారు. వైసీపీ అల్లరి, రౌడీ మూకలను ఎదుర్కోవడం టీడీపీ వల్ల కావడం లేదన్నారు జనసేనాని. తెలుగుదేశం సత్తా సరిపోకపోవడం వల్లే జనసేన రోడ్లపైకి వచ్చిందన్నారు.

## జగన్ చేతుల మీదగా... క్లాప్ కార్యక్రమం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీల్లోని 40 లక్షల గృహాలకు 1.20 కోట్ల డస్ట్ బిన్‌లు పంపిణీ చేస్తారు. ఇందుకు రూ.100 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చిస్తోంది. జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలలో 1,500 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించనున్నారు. మరింత మెరుగ్గా చెత్త సేకరణ, తరలింపు కోసం 3,097 ఆటో టిప్పర్లు, 1,771 ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేయనున్నారు.

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను 5,868 జీపీఎస్ ఆధారిత గార్బేజ్ టిప్పర్ల ద్వారా గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు తరలిస్తారు. 124 మునిసిపాలిటీలలో 231 గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్)లు ఏర్పాటు చేయడంతో పాటు 72 మునిసిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌డబ్ల్యూఎమ్) ప్రాజెక్టుల కోసం ఏజెన్సీల ఖరారుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. లక్ష పైచిలుకు జనాభా కలిగిన 32 మునిసిపాలిటీలలోని డంప్ సైట్‌లలో వ్యర్థాల నిర్మూలనకు టెండర్లు పిలవాలని మున్సిపాలిటీలను ఆదేశించారు. రాష్ట్రంలోని 65 నాన్ అమృత్ సిటీలలో సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి సేకరించిన వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎఫ్ఎస్‌టీపీ) ఏర్పాటు చేయనున్నారు.

## ప్రతి మహిళ ఆర్థికంగా నిలబడాలి: షేక్ నూర్జహాన్



ఏలూరు, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం ప్రతి మహిళ ఆర్థికంగా నిలబడాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలోని ఆదరణ పథకం ద్వారా 100 మంది లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. చేతి, కుల వృత్తిదారులందరూ కూడా వారి స్వయం కృషితో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. అన్ని కులాల వారు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో అన్ని కులాలవారికి ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన లబ్ధిదారుల అందరూ కూడా ఆర్థికంగా బలపడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాస్, వంకదార ప్రవీణ్ కుమార్, టి.స్రవంతి, డింపుల్ జాబ్, పప్పు ఉమామహేశ్వరరావు, కేదారేశ్వరి జగదీష్, మాదిరి నిర్మల, కో-ఆప్షన్ సభ్యులు గంపల బ్రహ్మవతి, నీతా విజయ్ కుమార్ జైన్, అదనపు కమిషనర్ సిహెచ్ వివియన్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, మేనేజర్ సిహెచ్ వివిఎస్ మూర్తి, పీవో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 70లక్షల రూపాయలు ఆసరా పథకం నిధులు విడుదల



ఏలూరు అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: దెందులూరు నియోజకవర్గం ఏలూరు మండలం మాదేపల్లి గ్రామంలో గ్రామ సచివాలయం పరిధిలోని 64 సంఘాల గాను మూడు కోట్ల 70 లక్షల రూపాయలు వైయస్సార్ ఆసరా పథకం కింద గ్రూప్ సభ్యులకు మంజూరు కావడం జరిగింది. ఈ సొమ్ము మొత్తం గ్రూపులకు దసరా కానుకగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు ఆడపడుచులకు దసరాకి ఇవ్వనున్నారు. ఈ సొమ్ము మొత్తం ఏవిధంగా గ్రూప్ సభ్యులు అందరూ సద్వినియోగ పరుచుకోవాలి అనే విషయంపై %ణ=ణూ% అధికారులు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి %ణ=ణూ% శ్రీపర్రు క్లస్టర్ సి.సి. నెల్లూరు నాగలక్ష్మి మరియు ఏలూరు మండల ఏ.పి. ఎం.ప్రభావతి వివోఏ రాజ్యలక్ష్మి గ్రామ సంఘం సభ్యులు మరియు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొనడం జరిగింది.

## అబ్బయ్య చౌదరిని మర్యాద పూర్వక కలయిక



ఏలూరు అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: దెందులూరు నియోజకవర్గం శాసనసభ్యులు కొఠారి అబ్బయ్య చౌదరి మరియు కొఠారి రామచంద్ర రావు ఆశీస్సులతో ఏకగ్రీవమైన ఏలూరు మండలం జడ్పిటిసి శ్రీమతి మండల సరస్వతి కొండల రావు మరియు ఏలూరు మండలం ఎంపిపి పి శ్రీనివాస రాజు ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు కోటేశ్వర దుర్గాపురం సర్పంచి వట్రీ లక్ష్మికుమారి నారాయణ రావు నాయాలుకు కూచిపూడి భాస్కర్ రావు (బాపనయ్య) మండల అధ్యక్షులు తేరా ఆనంద్ మహేశ్వరరావు బాలు వైఎస్ఆర్సిపి అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెదపాడు విశాల పరపతి సంఘం మహాజన సభ



ఏలూరు, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం పెదపాడు విశాల పరపతి సంఘం మహాజన సభ జరిగింది సంఘ చైర్మన్ రాజశేఖర్ అక్కినేని గారి అధ్యక్షతన సంఘ కార్యాలయంలో జరిగింది.. ఈ సందర్భంగా . అక్కినేని రాజశేఖరు మాట్లాడుతూ సంఘం 2020-21 ఆర్థిక సంవత్సరానికి నికరలాభం 1,05,51,471.09 వచ్చినది అని తెలిపారు.సదరు నికరలాభం విభజనలో మెంబర్లకు డివిడెండ్ గా నికరలాభంపై 29% చొప్పున మరియు వారి షేరు ధనముపై 15% చొప్పున ప్రకటించారు. 2020-21 సంవత్సరంలో సంఘం నుండి మెంబర్లకు ఇచ్చిన నగదు లోను సుమారు 2,50,000/- రూపాయలు ఇవ్వటం మూలముగా వారి సంఘ ఋణాల మీద చెల్లించుచున్న వడ్డీ భారము 15%నుండి 8% వచ్చినది. సదరు నగదు లోనుకు బడ్వాటా విషయంలోవిశేషముగా కృషి చేసిన శాసన సభ్యులు శ్రీ.కొఠారు అబ్బయ్యచౌదరి కి రాజశేఖర్ అక్కినేని ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు .కొల్లేరు మురళి మరియు శ్రీమతి.కాలిమరియమ్మ గారు సంఘ సిఈఒ, సిబ్బంది మరియు వైయస్ఆర్ సిపిఎంపిటిసి అక్కినేని గోపి, రాజుపేట సర్పంచ్ తొందూరు క్రాంతి తదితరులు పాల్గొన్నారు...

## అంతర్జాతీయ స్థాయిలో.. చీరాల ఉపాధ్యాయుని ఖ్యాతి

**- చీరాల ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తికి అంతర్జాతీయ పురస్కారం.**
**- అవార్డు అందించిన విద్యాశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్**
**- భానుచంద్రమూర్తిని ఘనంగా సన్మానించిన ఐ.ఎ.పి.సి ఛైర్మన్**



చీరాల(ఒంగోలు) అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: : విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ, విద్యార్థుల్లో బోధన,సైన్స్ పట్ల విద్యార్థులలో అవగాహన కల్పిస్తూ, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న, చీరాల ఉపాధ్యాయుడు పవని భానుచంద్రమూర్తి కి, అంతర్జాతీయ శాంతి రాయబారుల సంస్థ, అమెరికా వారి భారతీయ విభాగం, అంతర్జాతీయ పురస్కారం ప్రకటించింది.శుక్రవారం అంతర్జాతీయ శాంతి రాయబారుల సంస్థ(ఐ.ఏ.పి.సి), అమెరికా వారి భారతీయ విభాగం వారి ఆధ్వర్యంలో, విజయవాడ హెూటల్ రెడ్‌ఫాక్స్‌లో నిర్వహించిన ప్రత్యేకకార్యక్రమంలో, ఈ పురస్కారాన్ని పవని భానుచంద్రమూర్తి కి అందించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి ఆదిమూలపు సురేష్, తెలుగు అకాడమీ ఛైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, తాడికొండ శాసనసభ్యులు ఉండవల్లి శ్రీదేవి, ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రా రెడ్డి, ఐఎపిసి సంస్థ ఛైర్మన్ ప్రవీణ్ వర్మ, లు, భానుచంద్ర మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపుసురేష్ మాట్లాడుతూ, భాను చంద్ర మూర్తి విద్యారంగంకు, విద్యాభివృద్ధి కి,చేస్తున్న వివిధ రకాల సేవలను కొనియాడారు. కోవిడ్‌కాలంలో,ఆన్లైన్లో వివిధ పద్ధతులలో బోధన ,సైన్స్ ప్రచారంలో భాగంగా,చిన్నారులతో వివిధ రకాల కార్యక్రమాలు, అమలు చేస్తున్న కారణంగా, భాను చంద్రమూర్తి కి ఈ అవార్డు లభించిందని ఆయన అన్నారు. భానుచంద్రమూర్తికి అవార్డు లభించినందుకు, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. భానుచంద్రమూర్తి అంతర్జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా, సీనియర్ జర్నలిస్ట్ పెట్లూరి.వెంకటేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు పవని.రవికుమార్, పెట్లూరి శ్రీనివాసమూర్తి,పవని.నాగమురళీధర్, పవనిసురేష్ లు, భానుచంద్రమూర్తిని అభినందించారు. ఇంకా ఉన్నతస్థాయికి ఎదగాలని, వారు ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## ఒకటి కాదు.. రెండు కాదు...

## ఏకంగా అయిదు గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ స్నేహసుష్మిత

**- తండ్రి సేవాభావాన్ని పుణికి పుచ్చుకున్న డాక్టర్ సుష్మిత**
**- గీతం మెడికల్ యూనివర్సిటీలో అత్యుత్తమ విద్యార్థినిగా గుర్తింపు**
**- దేశవ్యాప్తంగా మారుమోగిన చీరాల పేరు**



చీరాల(ఒంగోలు) అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: : పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు, ఉచితంగా కొన్ని వేల కంటి ఆపరేషన్లు చేసి, సామాజిక సేవాదృక్పథంతో, పేదల దేవునిగా డాక్టర్ వరికూటి అమృతపాణి పేరు తెచ్చుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కన్నా,పేదలపాలిటి దైవ సమానులైన కంటివైద్యునిగా ఆయనకి మంచిపేరు ఉంది. జిల్లా అధికారిణి స్థాయిలో ఉన్నా కూడా, తన భర్త డాక్టర్ అమృతపాణి ఆలోచనలకు అనుగుణంగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, ప్రభుత్వ పరంగా ప్రజలకు సేవలు అందించడంలో, అంకితభావంతో విధి నిర్వహణ చేస్తూ డా.అమృతపాణి సతీమణి బేబీరాణి సైతం ప్రజలకు దైవ సమానురాలిగా నిలిచారు. తండ్రి ఆశయాల సాధనకు, పేద, బడుగు, బలహీనవర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు, వారి కుమార్తె డాక్టర్ స్నేహసుష్మిత, గీతం మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేయడమే కాకుండా, యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి, పులి కడుపున పులే పుడుతుంది అని నిరూపించారు. అంతేకాకుండా ఆర్థో, సర్జరీ, పిడియాట్రిక్స్, ఫోరెన్సిక్, కమ్యూనిటీ విభాగాలలో, విశేష ప్రతిభ కనబరిచి, ఏకంగా అయిదుగోల్డ్మెడల్స్ సాధించి, దేశవ్యాప్తంగా చీరాల పేరు మరోసారి మార్మోగేలా చేశారు. అంతేకాకుండా 15వేల నగదుబహుమతిని కూడా, యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ సెరెమోనీలో, అత్యుత్తమ వైద్యగ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యూనివర్సిటీటాపర్‌గా డాక్టర్ సుష్మితాకు అందజేశారు. పాఠశాల స్థాయిలోనూ, కళాశాల స్థాయిలోనూ,విశేష ప్రతిభ కనబరిచి,ఎన్నో బహుమతులను, ర్యాంకులను సాధించిన డాక్టర్ స్నేహ సుష్మితను, దేశవ్యాప్తంగా చీరాలకు మరోసారి మంచిపేరు తీసుకు వచ్చేందుకు కారణమైన డాక్టర్ సుస్మిత తల్లిదండ్రులు, డాక్టర్ అమృతపాణి, బేబీరాణి దంపతులను కూడా మనస్ఫూర్తిగా అభినందిద్దాం.

## గాంధీజీ ఆశయాలు నెరవేరుద్దాం

**నేటి యువత గాంధేయా మార్గంలో పయనించాలి**



కారంపూడి, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోని గాంధీ బొమ్మ సెంటర్ బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది ముందుగా విగ్రహానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ అహింస మార్గంలో ఎన్నో సాధించవచ్చని మహాత్మగాంధీ నిరూపించడం జరిగిందని అదే మార్గంలో ఉద్యమం చేపట్టి స్వాతంత్రం సాధించటం జరిగిందని వారు అన్నారు. మహాత్ముని ఆశయసాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ బొమ్మ సెంటర్ లో ఆర్యవైశ్య సంఘం నాయకులు మరియు బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రజా ప్రతినిధులు మండల పరిషత్ కార్యాలయం లో ఎంపిడీఓ బి.బాలునాయక్, ఎంపీపీ మేకల శారద శ్రీనివాసరెడ్డి ఉప ఎంపిపి గుండెబోయిన అమృత లక్ష్మి ఎంపిటీసీలు షేక్. ఆరిఫ్, వేముల. పద్మ, కొంగర. ఇందిరాదేవి, తాడిపత్రి.రమాదేవి, వెంపోగుల. నిర్మల, కొకా. అక్కమ్మ, ఈఓపిఆర్డి సత్యప్రసాద్, ఏఈపిఆర్ శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సిగ్మా దాయాగ్నస్టిక్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



నరసరావుపేట, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట పట్టణంలోని అరండల్ పేట లో సిగ్మా దయాగ్నస్టిక్స్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , మరియు షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆషాబేగం ఖాజావలి , వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి రమేష్ , మరియు వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు సమస్యలు పరిష్కరించాలి

**ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో**
**కారంపూడిలో నిరసన కార్యక్రమం**



కారంపూడి, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కారంపూడి లో జర్నలిస్టులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మొదటిగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం జర్నలిస్టుల సమస్యలను వినతి పత్రాన్ని గాంధీ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కల్పించాలని, నివేశ స్థలాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే గృహ నిర్మాణాలు చేపట్టాలని ప్రతి విలేఖరికి గౌరవ వేతనం చెల్లించాలని,కరోనా మహమ్మారి తో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ముఖ్యమంత్రి హామీ మేరకు 5 లక్షల రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కౌన్సిల్ సభ్యులు గుట్లపల్లి వెంకటప్పయ్య, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కౌన్సిల్ సభ్యులు బిట్రా రామకృష్ణ, సీనియర్ రిపోర్టర్ మైల శ్రీనివాసరావు, వార్తా కోటేశ్వరరావు, కోట రవికుమార్, యాదవరపు కోటేశ్వరరావు, ఆంధ్ర పత్రిక జాని భాష, సింహా న్యూస్ అనిల్ కుమార్, ప్రజాపాలన సాయి, లక్ష్యం రాజేష్ నాయక్ నాగేశ్వరావు,మనిదీప్,ప్రసాద్,తేజ,అజేష్,రవితేజ,ప్రసాద్,నారాయణ రెడ్డి, ఏపీ హైలెట్స్ రామారావు, తదితరులు పాల్గొన్నారు..

## గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు



నరసరావుపేట, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: ఏ పీ ఎస్ ఆర్టీసీ లో గత 20, 30 సంవత్సరములు ఉద్యోగాలు చేసి రిటైర్డ్ అయిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ వివిధ రకాల ఉద్యోగస్తులకు నెలకు కనీసం 1000 రూపాయలు కూడా పెన్షన్ రావడం లేదని మాకు కనీస పెన్షన్ 9000 వేల రూపాయలు వచ్చేటట్లు చేయాలని నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహానికి ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నరసరావుపేట డిపో నాయకులు తమరి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు శనివారం గాంధీ జయంతిని పురస్కరించుకొని శాంతి మార్గంలో భారతదేశానికి స్వతంత్రం తీసుకురావడానికి అగ్రభాగాన నిలబడి కృషిచేసిన మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి తమ సమస్యలను పరిష్కారం చేయాలని వేడుకొన్నారు అనేక దఫాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకుని వెళ్ళిన దేశరాజధాని జంతర్మంతర్ వద్ద ధర్నా చేపట్టిన తమకు కనీస పెన్షన్ సౌకర్యం కల్పించడం లేదని కుబేరులను అపర కుబేరులు చేయడానికి చేయడానికి ఉన్న శ్రద్ధ సామాన్య ప్రజానీకం కార్మికుల పైన ఈ నరేంద్ర మోడీకి లేదని అన్నారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇ ఉమా కాంతారావు సహాయ కార్యదర్శి కడియం యోహాన్, పి కోటేశ్వరరావు, ఎన్ మస్తాన్ రావు, డి సుభాష్, చంద్రబోస్, ఆర్ పిచ్చయ్య, బి ప్రభాకర్, ఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


PAY BACK TO SOCIETY
SNEHA CLUB
స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్
కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్
SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

ప్రజాపాలన

సంపాదకీయం

ఆదివారం 03, అక్టోబరు 2021

# గాంధీ మార్గమే ప్రత్యామ్నాయం

భారతీయులను మనోబల సంపన్నులుగా, నిర్మాణ కార్యక్రమ నిపుణులుగా, శాంతిదూతలుగా, పరమత సహనమూర్తులుగా తీర్చిదిద్దటం మహాత్ముని లక్ష్యం. ఒక సంస్కర్తగా, ఒక సేవాపరుడుగా, ఒక కర్మయోగిగా, ఒక మహర్షిగా, ఒక మానవతామూర్తిగా ఆయన సర్వకాల సర్వావస్థలకూ చెందినవాడిగా నిలిచారు. వేగంగా అంతరిస్తున్న ప్రకృతి సంపద, ఆచరణ కోల్పోయిన విలువలు, మసిబారిన పర్యావరణం ప్రపంచశాంతికి విఘాతాలు అని ఆయన అన్నారు. ఒక టన్ను సిద్ధాంతపత్రాల కన్నా ఒక 'ఔన్సు' ఆచరణ గొప్పదని గాంధీ విశ్వసించారు. శాంతి,సత్యం, అహింస, నైతిక జీవనవిలువల ద్వారా దేశానికి స్వాతంత్ర్యాన్ని, అభివృద్ధినీ కాంక్షించిన మహాత్ముడి మార్గంలో 21వ శతాబ్ది సమస్యలకు, ప్రపంచ అశాంతికీ సమాధానాలు దొరుకుతాయా? ఈ యుగానికి గాంధీ మహాత్ముని ఉపయుక్తత ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం గాంధేయవాదంలోనే కనిపిస్తుంది. గాంధీ మహాత్ముడు అమెరికా సందర్శించలేదు. కానీ, ఆయన బోధనలు మార్టిన్ లూథర్ కింగ్ లాంటి గాంధేయవాద అనుయాయులను ఉత్తేజపరచి, ఆ దేశంలో జాతి వివక్షకు అహింసా పద్ధతులతో ఒక పరిష్కారాన్ని సాధించగలిగాయి. మన మహాత్ముని 150వ జన్మదినాన్ని స్వదేశీయులకన్నా మిన్నగా అమెరికాలో జరుపుకుంటున్నారంటే గాంధేయవాదంలోని మానవత, ప్రభావశీలతే అందుకు కారణం అని భావిస్తాను. గాంధేయమార్గంలో శాంతి, సహజీవన, సమభావనల సాధన సాధ్యమని తన స్వీయ కార్యాచరణతో ప్రపంచానికి మార్టిన్ లూథర్ కింగ్ నిరూపించారు. రాముడు, బుద్ధుడు, క్రీస్తు, అల్లా ఆయనకు మార్గదర్శకులు. అహింసను పరమధర్మంగా ఆచరించి యావత్ ప్రపంచాన్ని ఆయన ప్రభావితం చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నట్టు మహాత్ముడు జరిపిన వీరోచిత పోరాటాలలోకన్నా ఆయన పావన జీవనంలో గాంధీ గొప్పతనం ఎక్కువ కనిపిస్తుంది. విధ్వంసకశక్తులు విజృంభిస్తున్న తరుణంలో సృజనాత్మకశక్తికి చైతన్య లక్షణానికి ఆయన ఇచ్చిన ప్రాధాన్యతలో ఆ గొప్పతనం ఉంది. మహాత్ముడి నేతృత్వంలో సాగిన సత్యాగ్రహ ఉద్యమ ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మాట నిజం. కానీ, స్వాతంత్ర్యం తేవటమే లక్ష్యంగా గాంధీ మహాత్ముడు జీవించలేదు. దేశీయుల్ని మనోబల సంపన్నులుగా, నిర్మాణ కార్యక్రమ నిపుణులుగా, శాంతిదూతలుగా, పరమత సహనమూర్తులుగా తీర్చిదిద్దటం ఆయన లక్ష్యం. ఆత్మజ్ఞానం ద్వారా మోక్షాన్ని పొందటమే తన జీవిత ధ్యేయమని గాంధీజీ ఒక సందర్భంలో అన్నారు. మానవజాతి సర్వతోముఖ వికాసానికి పాటుబడటమే ధ్యేయం కావాలని ఆయన నిర్మాణ కార్యకర్తలకు ఉద్బోధించారు. గాంధీజీ తన కార్యాచరణ కేవలం రాజకీయరంగానికి మాత్రమే కాకుండా సమస్త మానవాళి సర్వతోముఖ వికాసానికి వినియోగపడాలని భావించారు. కనుకనే ఒక సంస్కర్తగా, ఒక సేవాపరుడుగా, ఒక కర్మయోగిగా, ఒక మహర్షిగా, ఒక మానవతామూర్తిగా ఆయన సర్వకాల సర్వావస్థలకూ చెందినవాడిగా ఆయన నిలిచారు. 'గాంధీజీ సందేశాన్ని అమెరికా, ప్రపంచం పొంది ఉండకపోతే, అమెరికా సంయుక్తరాష్ట్రాల అధ్యక్షుడిగా ఈ రోజు నేను మీ ముందు నిలబడి ఉండేవాణ్ణి కాదు' అని ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత పార్లమెంటులో ప్రసంగిస్తూ అన్నారు. 1964లో మార్టిన్ లూథర్ కింగ్ నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నప్పుడు, 'జాతి వివక్ష సమస్య విషయంలో మేము అనుసరిస్తున్న విధానం కొత్తదేమీ కాదు, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొని అనేక శతాబ్దాలుగా రాజకీయ ఆర్థిక దాస్యం అనుభవిస్తున్న తన దేశ ప్రజల విముక్తికి మహాత్మాగాంధీ ఎంతో ప్రతిభావంతంగా అనుసరించిన విధానమే అది' అని, ఆనాటి వివక్ష వ్యతిరేక పోరాటాలను ఒబామా స్మరించుకున్నారు.

# శ్రామిక ధార్మికుడు మన మహాత్ముడు



శ్రమ లేని సంపద, వివేకాన్ని ఆవలకు నెట్టిన విలాసం, మానవత్వం లేని శాస్త్రవిజ్ఞానం, శీలం కొరవడిన ప్రతిభ, నియమావళి లోపించిన రాజకీయం, నైతికత లేని వాణిజ్యం, త్యాగం కొరవడిన పూజ... వీటన్నిటినీ గాంధీ తప్పుపట్టారు. సత్యం అంటే అవ్యాజ ప్రేమ, అన్యాయం పట్ల ఆగ్రహం, అణగారిన జనం పట్ల సానుభూతి జీవనపర్యంతమూ ఆయన రాజీ పడకుండా అంటిపెట్టుకున్న సూత్రాలు. గాంధీ బహుముఖీన వ్యక్తిత్వం యావత్తూ మానవహక్కుల పట్ల ఆయన శ్రద్ధ, పరితాపాన్ని ప్రతిబింబిస్తుంది.

'మానవత్వం మీద మనం విశ్వాసం కోల్పోనక్కర లేదు . కొన్ని చుక్కల నీరు కల్మషమైతే సముద్రం మొత్తం చెడిపోయినట్టేనా ?'

–గాంధీ

'మహాత్ముడు', 'జాతి పిత', 'బాపు' అనే కితాబులు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీకి తగిలించేసి ఆయన విశ్వసించి, ఆచరించిన సమస్తాన్నీ ఉపేక్షించిన వారం మనవే కాదూ? అక్టోబర్ 2ను సెలవుదినంగా పరిగణించి ఏవో సంస్మరణసభలు జరుపుకోవడం మినహాయించి గాంధీ చూపిన ఆదర్శాలు మనం ఏమేరకు ఆచరిస్తున్నాం?జాతి సమస్తానికీ సంపద, ప్రగతి సమంగా చెందాలని గాంధీ కలలుగన్న 'సర్వోదయ' సమాజం మనకు ఇంకా కనుచూపుమేరలోనైనా అగుపడుతోందా? ఇది నిస్పృహో, రంధ్రాన్వేషణో కాదు. ఒక కఠోర వాస్తవం.భారతీయులు, ఇంకా దేశదేశాల వారు తనను 'మహాత్మ'గా గౌరవించడం ఆయనకు నచ్చేది కాదు. 'నాకు ఎలాంటి మహత్తులూ లేవు. ఏ మహత్తులూ నాకొద్దు కూడా....' అని నిస్సంకోచంగా చెప్పేసిన ఆచరణశీలి, నిరంతర చలనశీలి గాంధీ. తాను ఆచరించని దేన్నీ గాంధీ మాట్లాడేవారు కాదు. ఏ పడికట్టు, పిడివాదం పంజరంలోనూ ఆయన బందీ అవలేదు. హింసకు తావులేని పోరాటపథంలో ఆయన ఎప్పటికప్పుడు సవరణలూ, సర్దుబాట్లూ చేసుకుంటూ చివరిదాకా గమనం సాగించారు. భారతీయ చింతనలో అహింస గాంధీకి ముందూ ఉంది. గాంధీ చేసిందల్లా ఆ భావనను ఒక రాజకీయ వ్యూహమూ, శస్త్రమూ చెయ్యడమే. బ్రిటిష్‌వాళ్ళు ఇండియాను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించడానికి గాంధీ అనుసరించిన పోరాట పథమే అసలు కారణం కాదనీ, సువిశాల భారతావనిలో తమ ప్రభుత్వం కొనసాగడానికి తగిన ఆర్థికవనరులు సన్నగిల్లడమే కారణమనీ చెప్పుకొస్తారు కొందరు మేధావులు. 1920లో గాంధీ వ్యూహాత్మకంగా ఇచ్చిన విదేశీ వస్తు బహిష్కరణ ప్రభావం బ్రిటిష్ ప్రభుత్వం ఆదాయాన్ని కోలుకోలేనట్టుగా దెబ్బతీయడం కాదనగలమా? భారత్‌కు ఎగుమతుల ద్వారా 1924లో ఇంగ్లండు 90.6 మిలియన్ స్టెర్లింగ్ పౌండ్లు ఆర్జించగా, 1930కి అది 52.9 మిలియన్ పౌండ్లకు పడిపోయింది. బ్రిటిష్ పాలకులకు ఈ లోటు, గాంధీ పోరాటవ్యూహం తెచ్చింది కాదా?అహింసను ఒక సైద్ధాంతిక నైరూప్యంగా కాకుండా ఆచరణీయ రాజకీయ సాధనంగా చేపట్టిన భావ సాహసి, దార్శనికుడు గాంధీ. మోహన్‌దాస్ గాంధీ అనే ఒక మామూలు మనిషి మహాత్ముడైన వైనం నమ్మశక్యం కానిది. అలాంటి ఒక మానవుడు రక్తమాంసాలతో భూమ్మీద తిరిగాడని ఊహించలేం (ఈ మాట శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌ది!). గాంధీ పోరాడింది కేవలం దేశ స్వాతంత్ర్యం కోసమే కాదు. మహిళలకు హక్కులు, కులవివక్షను రూపుమాపడం, మత విద్వేషాలకు ఎదురునిలవడం, జంతు సంక్షేమం.... ఇవన్నీ గాంధీ చివరిదాకా విస్మరించని సామాజికాంశాలు.రాజ్యహింస, నరమేధం అక్కడక్కడా అన్ని భౌగోళిక ప్రాంతాల్లోనూ తలెత్తుతూనే ఉన్నా అహింస ఆచరణీయత ఇంకా బతికే ఉంది. నవ్య మానవచరిత్రలో అహింసను అంతగా అపరిగ్రాహ్యం చేసిన మహనీయుడు కచ్చితంగా మహాత్ముడే. సమాజాన్ని దౌర్జన్యం, హింస, ఆధిపత్యపు సంకెళ్ళ నుంచి విముక్తం చేయడానికి తనదైన, తనదే అయిన మార్గం ఎన్నుకుని నడిచిన అలుపెరుగని యోధుడు గాంధీ. పేదరికమే హీనమైన హింస అని నమ్మిన సామ్యవాది గాంధీ. కంటికి కన్ను అన్న మృగ న్యాయం సరికాదన్న ప్రాథమిక నమ్మకం నుంచి తన ఉద్యమ సూత్రావళి అల్లుకున్న సాదా సీదా నిష్కపటి గాంధీ. ఆలోచించేదీ, మాట్లాడేదీ, చేసేదీ ఒకటే కావాలని రుజువు చేసిన శ్రామిక ధార్మికుడు గాంధీ వందేళ్ళ క్రితం స్వాతంత్ర్యోద్యమం తన కనుసన్నలలో నడిచినప్పుడు గాంధీ తీసుకున్న నిర్ణయాలు, వాటి ఔచిత్యం, తన పోరాటంలోని నైతిక సూత్రావళి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. గాంధీ తనను తాను అంచనా వేసుకున్నంత, నిర్వచించుకున్నంత భేషజరహితంగా, నిజాయితీగా ఆయన సమకాలికులు కానీ తరువాతి కాలంలో వాళ్ళుగానీ విశ్లేషించుకోలేకపోయారు. 'సగటు సామర్థ్యం కన్నా తక్కువ ఉన్న సాధారణ మనిషి కంటే అధికుడిని అని నేను అనుకోను' అని ఒప్పుకోగలిగిన వినయం ఆయనది. ఆయన వినయం అభినయం కానే కాదు. ఆయనేమీ దివి నుంచి దిగివచ్చిన వాడు కాదుబీ కోట్లాది జనం లోంచి వాళ్ళ వేషభాషలూ, భావోద్వేగాలూ పంచుకుని ముందుకు నడిచినవాడు. సత్యమూ, అహింసలే కాదు, నిర్భీతి కూడా గాంధీ నమ్మిన అమూల్య సుగుణం. శతాబ్దాల పరాయిపాలన లజ్జాస్పదమనీ సంకెళ్ళు తెంచుకోవడానికి భయమూ సంకోచమూ ఆవలికి నెట్టాలనే ప్రగాఢసంకల్పం జనం మానసంలో బలపడడానికి గాంధీ ఋజువర్తన ప్రధానంగా దోహదం చేసింది.స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ అడుగిడిన తొలినాళ్ళలోనే ఠాగూర్ ఒక వ్యాఖ్య చేశారు%--% 'ఈ మనిషి బహుశా సఫలం కాడుబీ అసమానతల ఉచ్చు లోంచి మనిషిని వేరు చేసే ప్రక్రియలో బుద్ధుడిలా, జీసస్‌లా ఇతనికీ నిరాశే మిగలవచ్చు. కానీ రాబోయే తరాలకు తన జీవితం తప్పక పఠనీయం అవుతుంది' అని. నియంతృత్వానికి ప్రతిగా నిష్క్రియాపరత్వంలో ఉండిపోయే పలాయనవాదం కాదు గాంధీ నమ్మిన అహింస. అహింస అంటే గాంధీకి అంతర్గత ధీరత్వంబీ పిరికివాడి ఆఖరి అస్త్రం కాదు. సంక్లిష్ట సమయాల్లో నిమ్మళంగా నిలబడడం, ఓటమి అంచుల్లోనూ నమ్మకంతో నడవడం, జాతి తన మీద పెట్టుకున్న విశ్వాసం అనుక్షణం స్పృహలో ఉంచుకోవడం గాంధీ ఎన్నడూ విస్మరించలేదు. జీవితంలో దాదాపు ఆరేళ్ళ జైలుజీవితం గడిపిన గాంధీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలై బతికారు. శ్రమ లేని సంపద, వివేకాన్ని ఆవలకు నెట్టిన విలాసం, మానవత్వం లేని శాస్త్రవిజ్ఞానం, శీలం కొరవడిన ప్రతిభ, నియమావళి లోపించిన రాజకీయం, నైతికత లేని వాణి జ్యం, త్యాగం కొరవడిన పూజ... వీటన్నిటినీ గాంధీ తప్పుపట్టారు. సత్యం అంటే అవ్యాజ ప్రేమ, అన్యాయం పట్ల ఆగ్రహం, అణగారిన జనం పట్ల సానుభూతి జీవనపర్యంతమూ ఆయన రాజీ పడకుండా అంటిపెట్టుకున్న సూత్రాలు. గాంధీ బహుముఖీన వ్యక్తిత్వం యావత్తూ మానవహక్కుల పట్ల ఆయన శ్రద్ధ, పరితాపాన్ని ప్రతిబింబిస్తుంది. సాధారణ ప్రజానీకం ఒకటిగా ఉద్యమించి అసాధారణ ఫలితాలు చవిచూడొచ్చని నిరూపించిన ధన్యజీవి గాంధీజీ. 78 ఏళ్ళ శ్వాసించి ప్రపంచానికొక సంభ్రమంలా అనిపించి 1948 జనవరి 30న తనువు చాలించిన గాంధీ అవిస్మరణీయుడు. దేశ కాలాల కతీతంగా సమాజహితం కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ గాంధీ జీవితం ఒక అధ్యయన గ్రంథం. గాంధీ ఒక ఋషి. ఇది కాదనలేని సత్యం. ఒప్పుకోని వాళ్ళు ఉంటే ఉండొచ్చుగాక.!

# గర్భగుడి చుట్టూ కందకం-.. కులం!!

వరుసగా నాలుగు మంచిమాటలకు అర్హత కలిగిన ముఖ్యమంత్రులు ఎప్పుడైనా ఉన్నారా? పైకి అంగీకరించడం కష్టం అనుకుంటే, కనీసం మనసులో అయినా అనుకున్నావెూ లేదో తెలియదు. అప్పుడప్పుడు కొన్ని మెరుపులు మెరిపించిన నాయకులు లేకపోలేదు. ఆ మేరకు విమర్శల నుంచి మినహాయింపు ఇస్తామేమో కానీ, పెదవి విప్పి ప్రశంసించడం కష్టం. అటువంటిది, కలైంజర్ టీవీ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మీద నాలుగు మంచి మాటలు మాట్లాడమంటే, ఒప్పుకోవడం కష్టమేమీ అనిపించలేదు. అతను మునుపు ఎట్లా ఉన్నాడో, రేపు ఎట్లా ఉండబోతాడో ఏమీ తెలియదు. ముంచుకు వచ్చిన పరిస్థితులు అతడికి సాపేక్ష యోగ్యతను పెంచాయి తప్ప, అంతకుమించి ఆశించడానికి ఏమీ ఉండకపోవచ్చు.తనని అదే పనిగా పొగిడి సభా సమయం వృథా చేయవద్దని స్టాలిన్ తన పార్టీ శాసన సభ్యులను హెచ్చరించారన్న వార్త పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో పాఠకులను బాగా ఆకట్టుకుంది. అధికార రాజకీయాలలో ప్రశంస, ప్రశంసను ఆనందించే ధోరణి అధికంగా ఉంటాయి. స్టాలిన్ నిజంగా ప్రశంసాప్రియత్వాన్ని అధిగమించాడో లేదో తెలియదు కానీ, తన ప్రతిష్ఠను పెంచుకునే వరుస చర్యలలో భాగంగా, ఈ హెచ్చరిక కూడా చేశాడు. మన మీడియాలో వివక్షలు, రాగద్వేషాలు ఎంతగా అంతర్భాగమై ఉంటాయంటే, స్టాలిన్ ఇతర నిర్ణయాలకు ఇంతటి ప్రచారం రాలేదు. నిజానికి, ఎక్కువగా మాట్లాడుకోవలసినవీ, చర్చించవలసినవీ ఆ నిర్ణయాలే.ఢిల్లీలో ఉన్న ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం అని పిలవనని, సమాఖ్య ప్రభుత్వమని వ్యవహరిస్తానని డిఎంకె ప్రభుత్వం చెప్పినప్పుడే, కొత్త రకం చర్చలకు, చర్యలకు దారితీసే ధోరణి నూతన నాయకత్వంలో ఉన్నదన్న సూచన లభించింది. సిద్ధాంతవాదిగా, ప్రజానాయకుడిగా తనకు సొంతంగా తగినంత ప్రతిష్ఠ లేనందున, పెరియార్, అన్నాదురై దగ్గర నుంచి కరుణానిధి తొలిఅడుగుల దాకా స్టాలిన్ పదే పదే ఆలంబన చేసుకుంటున్నాడు. అందుకు కావలసిన వెన్నుదన్ను ఏదో ఆ పార్టీ వ్యవస్థలో ఉన్నట్టున్నది. నూతన విద్యావిధానాన్ని సూత్రబద్ధంగా వ్యతిరేకించడం, ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుకున్నవారికి వృత్తి విద్యాసంస్థలో రిజర్వేషన్ కల్పించడం, ప్రజారంగంలో పనిచేస్తున్న మేధావులను, కార్యకర్తలను నిరంకుశ చట్టాల ద్వారా కేంద్రం ఎడతెగని నిర్బంధంలో ఉంచడాన్ని నిలకడగా వ్యతిరేకించడం, తాజాగా రైతు వ్యతిరేక చట్టాలపై శాసనసభలో తీర్మానం చేయించడం అందరి దృష్టినీ తమిళనాడు మీదకు మళ్లించాయి. గుడులలో అర్చనలు చేయించేటప్పుడు భక్తులు మంత్రాలు తమిళంలో చదవాలని కోరేందుకు అవకాశం కల్పించడం కూడా ఆసక్తికరమైది. వీటన్నిటి కంటె కీలకమయినది, దీర్ఘకాలంగా అమలుకాకుండా నిలిచిపోయిన బ్రాహ్మణేతర అర్చకుల నియామకాల విషయంలో సాహసంతో నిర్ణయం తీసుకోవడం. దేవాలయాలలో బ్రాహ్మణాధిపత్యం పెరియార్ మనసులో ముల్లులా మిగిలిపోయిందని, ఆ ముల్లును తీసేయాలని కరుణానిధి 1970ల మొదట్లోనే ప్రయత్నించారు. న్యాయవ్యవస్థ ఆనాడు సహకరించలేదు. 2006లో మరోసారి ప్రయత్నించారు. పూర్తిగా సానుకూలత లభించలేదు కానీ, ఒక దారి కనిపించింది. ఆగమశాస్త్ర ప్రకారం శిక్షణ పొందితే, ఏ కులం వారినైనా అర్చకులుగా నియమించుకునే అవకాశం లభించింది. అర్చకులకు శిక్షణ కోసం ఒక విద్యాసంస్థను నెలకొల్పి, మొదటి విడతగా 206 మందికి శిక్షణ ఇస్తే, వారిలో ఒక్కరంటే ఒక్కరికి పన్నెండేళ్ల పాటు ఏ నియామకమూ లేదు. పెరియార్ బాధను తొలగించలేదన్న తన తండ్రి బాధను స్టాలిన్ తొలగించే ప్రయత్నం చేశారు. మొదటి విడతగా ఒక మహిళ, కొందరు దళితులతో సహా 75 మంది బ్రాహ్మణేతరులకు నియామక పత్రాలు అందజేశారు. ఇప్పటికీ, ఆ ప్రక్రియ ఏ ఆటంకమూ లేకుండా ముందుకు వెడుతుందని కాదు, శిక్షణ పొందినవారిని ఎక్కడ ఏ విధినిర్వహణలో నియమిస్తారు, ప్రధాన ఆలయాల్లోనా చిన్న గుడులలోనా వంటి ప్రశ్నలకు ఇంకా ఆస్కారం ఉంటుంది. కాకపోతే, ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా మధుర మీనాక్షి ఆలయంలో ముగ్గురు బ్రాహ్మణేతరులను అర్చకులుగా తీసుకున్నారు.దేవాలయాల్లో దళితులను, శూద్రులను అర్చకులుగా తీసుకోవాలనే డిమాండ్ ఎందుకు? ఎందుకంటే, కులవ్యవస్థలో అన్నిటికంటె పై మెట్టులో ఉన్న కులానికి, సామాజిక ఆధిక్యాన్ని కల్పిస్తున్న వాటిలో అర్చకత్వం, పౌరోహిత్యం కూడా ఉన్నాయి. ఆ వృత్తులను ప్రజాస్వామ్యీకరించగలిగితే కుల తారతమ్యాలు బలహీనపడతాయి. భగవంతుడికి భక్తుడికి మధ్య వ్యవహరించగలిగేవారు, అంకిత భావం కలిగి ఉండి, శాస్త్రవిధి తెలిసి ఉంటే సరిపోతుంది కానీ, కుల అర్హతలెందుకు? "...ఉన్నత విద్య, ఉపాధి, ఆర్థికశక్తి దళితులకు భౌతిక ప్రతిపత్తిని పెంచుతాయి, వాటి ద్వారా క్రమంగా సామాజిక ప్రతిపత్తి కూడా ఎప్పటికో మారవచ్చు, మారకున్నా భౌతిక నష్టమేమీ లేదు. అట్లా కాక, దేవాలయ ప్రవేశం వంటి నినాదాల వల్ల దళితులకు ఏమి ప్రయోజనం, ఏ ప్రతిపత్తి మారుతుంది?'' అని బాబాసాహెబ్ అంబేడ్కర్ ఒకసారి ప్రశ్నించారు. కేవలం దేవాలయాలలోకి ప్రవేశమే అయితే, ప్రయోజనమేమీ లేదని, అది అసమానత్వాన్ని, చాతుర్వర్ణ వ్యవస్థను, కులాన్ని నిర్మూలించడానికి చేసే పోరాటంలో మొదటి అడుగు అయితే దాని గురించి ఆలోచిస్తామని ఆయన దేవాలయ ప్రవేశ బిల్లుపై గాంధీజీతో జరిగిన చర్చలో చెప్పారు. దేవాలయాల్లో దళితుల ప్రవేశానికి అంబేడ్కర్ కూడా సత్యాగ్రహం నిర్వహించి, సవర్ణ సమాజం స్పందన ఎట్లా ఉంటుందో సహచరులకు అర్థమయ్యేట్టు చేశారు. ఆ తరువాత ఆయన దేవాలయ ప్రవేశ అంశానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. అంబేడ్కర్ చెప్పిన కుల నిర్మూలన ప్రయాణంలో ఆలయ ప్రవేశం తొలి అడుగు అయి ఉంటే, ఆలయాలలో అర్చకులుగా దళితులు నియమితులు కావడం బహుశా మరొక మజిలీ అయి ఉండేది. సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాల కంటె కూడా, ఆలయ గర్భగుడిలో దళిత అర్చకుడు, సమానత్వ ఆదర్శాలకు గీటురాయి.తిరుమల తిరుపతి దేవస్థానం 200 మంది దళితులను ఎంపిక చేసి మూడు నెలల పాట అర్చక శిక్షణ ఇచ్చింది కానీ, వారిని దళితులు అధికంగా నివసించే ప్రాంతాలలో నూతనంగా నిర్మించే ఆలయాలలో పూజారులుగా నియమిస్తామని చెప్పింది. దేశంలో సవర్ణులకు ప్రధాన దైవ క్షేత్రాలుగా ఉన్న చోట బ్రాహ్మణేతర అర్చకులు ఎక్కడా కనిపించరు. విశ్వహిందూ పరిషత్తు వారు కూడా హిందువుల మధ్య అసమానతలను తొలగించే ప్రయత్నంలో భాగంగా దేశవ్యాప్తంగా 5000 మంది దళితులకు అర్చకులుగా శిక్షణ ఇచ్చామని చెప్పుకున్నారు. శిక్షణ పొందినవారు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వారున్నారట. వారు ఎక్కడెక్కడ అర్చకులుగా ఉన్నారో వివరాలు తెలియవు. అయోధ్య రామాలయం నిర్మాణానికి 1989లో జరిగిన శిలాన్యాస కార్యక్రమాన్ని కామేశ్వర్ చౌపల్ అనే దళితుడి చేత చేయించారు. 1964లో ఏర్పడిన పరిషత్ హిందువుల ఐక్యతకు కుల అసమానతలు కారణమని గుర్తించి, హిందువులందరూ సోదరులే, అస్పృశ్యులెవరూ లేరంటూ 1969లో ఉడిపి మహాసభలో పీఠాధిపతుల చేత ప్రకటన చేయించింది. దురదృష్టవశాత్తూ, ఈ యాభై ఏళ్ల కాలంలో కులం సమసిపోలేదు. దళితులపై అత్యాచారాలను సమర్థించే మతగురువులను కూడా చూస్తున్నాము. విహెచ్‌పి కూడా ఇతర కార్యక్రమాలను పక్కనపెట్టి, హిందువులలో ఉన్న సాంఘిక జాడ్యాలను తొలగించే కృషి చేసి ఉంటే ఐక్యత మరింత మెరుగుగా సాధించేదేమో? లోకంలోని మరే దైవం కన్నా అయోధ్యలోని శ్రీరాముడు న్యాయానికి ప్రతీకగా కనిపిస్తాడని ఆలయ నిర్మాణ ఆరంభం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మరి, రామాలయంలో సామాజిక న్యాయం సంగతేమిటన్న ప్రశ్న రావాలి కదా? వెనుకబడిన కులానికి చెందిన ప్రధానమంత్రి ఆలయ కార్యక్రమానికి సారథ్యం వహించారు నిజమే, కానీ, రాముడిని అర్చించే పూజారులలో శూద్రులు ఉన్నారా, దళితులు ఉంటారా? అని సామాజిక శాస్త్రవేత్త కంచె ఐలయ్య ప్రశ్నించారు. ఈ ప్రశ్న కమ్యూనిస్టులు, ఉదారవాదులు ఎందుకు వేయడం లేదని ఆయన నిలదీశారు.అయోధ్యనే కాదు, యాదాద్రి విషయంలోనూ ఈ ప్రశ్న రావాలని ఐలయ్య అంటున్నారు. దళిత బంధు పథకం అన్నారు సరే కానీ, యాదాద్రిలో ఒక శూద్రుడినో, దళితుడినో అర్చకులుగా ఎందుకు నియమించరు? అని ఆయన ఈ మధ్య ఒక జూమ్ చర్చలో అడిగారు. ఆ సామాజిక స్థాయి కల్పిస్తే, పదిలక్షలు అవే సమకూరతాయని, సమాజ స్వరూపంలోనే మౌలిక మార్పు వస్తుందని ఆయన అభిప్రాయం. ఆయన అడిగినా, కులనిర్మూలనవాదులందరూ అడిగినా, ఎందుకు ఇంకా గర్భగుడులు కులతత్వంలో ఉన్నాయన్న ప్రశ్న ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేదే, సమాజంలో చర్చను రేపేదే. కానీ, ఎవరో ఒకరు ఇటువంటి విస్ఫోటక ప్రశ్నలు వేయకపోతే, మన సామాజిక న్యాయ ఆదర్శాల డొల్లతనం బయటపడేది ఎట్లా? ఇతర ముఖ్యమంత్రులతో పోల్చి స్టాలిన్‌ను ఎట్లా అంచనా వేస్తారని కలైంజర్ టీవీ యాంకర్ అడిగాడు. తమిళ నాయకుడి ముందు మన తెలుగు ముఖ్యమంత్రులను చిన్నబుచ్చడం మంచిది కాదని మొదట అనిపించింది. తమ్ముడు తనవాడైనా ధర్మం తప్పకూడదు కదా? ఇండియా టుడే వాడు చెప్పాడని కాదు కానీ, తెలుగు నాయకుల రేటింగ్ మరీ పడిపోయింది!

# మహనీయుల త్యాగాలను మరువలేనివి: రూరల్ ఎస్పీ విశాల్ గున్ని

గుంటూరు, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: మహనీయులు త్యాగాలను మరువలేనివనిఅని గుంటూరు రూరల్ ఎస్పీ విశాల్ గున్ని అన్నారు. శనివారం రూరల్ జిల్లా పోలీస్ కార్యాలయములో ఘనముగా గాంధీజీ మరియు శాస్త్రీజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపిన రూరల్ ఎస్పీ విశాల్ గున్ని ఐపీఎస్.లిఈ సందర్భాముగా ఎస్పీ విశాల్ గున్ని మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీన ఇద్దరు స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయులైన మహాత్మాగాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు జరువుకోవడం ఎంతో సంతోషముగా ఉందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు స్మరణలు మానవాళి మనుగడకు ఎంతో ఉపయుక్తములు. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కృషి చేసిన వారు ఒకరైతే, స్వాతంత్ర్య భారతావనికి ప్రధానిగా సేవచేసి, ప్రగతి పథములో నడిపించిన వారు మరొకరు అన్నారు. ఆ మహనీయుల త్యాగాలు,వారు అనుసరించిన మార్గాలు,లక్ష్య సాధనకు వారు పాటించిన సూత్రాలు మనకు ఎల్లప్పుడు స్ఫూర్తి దాయకాలని, ఆ మహనీయుల జయంతి ఉత్సవాలను ఒక రోజే జరువుకుని విడిచిపెట్టకుండా వారిని అణుక్షణం గుర్తుపెట్టుకునే విధముగా వారి ఆకాంక్షలకు,నైతిక విలువలకు అనుగుణముగా మనం నడుచుకోవాలని, అప్పుడే వారిని గౌరవించినట్లు ఉంటుందని తెలిపారు.గాంధీజి ఎన్నో ప్రభావిత పుస్తకాలు రచించారు,వాటిలో మై ఎక్సపెరిమెంట్స్ విత్ ట్రూత్స్అనే పుస్తకం ఒకటి.ఆ పుస్తకమంలో లి"సమాజములో మార్పు రావాలంటే ముందు మీలో మార్పు రావాలి"లి అనే వాక్యం మనకు ఎంతో స్ఫూర్తిదాయకమైనదని అన్నారు. ప్రతి రోజు ఎన్నో సవాళ్లవు ఎదుర్కొంటూ విధులు నిర్వర్తించే మన పోలీస్ వారికి గాంధీజి సూత్రాలు,ఆయన ఆదర్శాలు పాటించడం వలన మనలో సానుకూల దృక్పధాలు అలవడతాయి. విధి నిర్వహణ సమయములో మన నడవడిక, ప్రజలతో మన ప్రవర్తన,మన వ్యక్తిత్వం వంటివి మన గౌరవం మీద ప్రభావం చూపుతాయి.గాంధీజి సూత్రాలను పాటించడం వలన వీటిని మెరుగుపరచుకుని ప్రజలకు అత్యుత్తమముగా సేవలు అందించగలుగుతాం మని, లిమనలో ఆ మహనీయుల ఆదర్శ సూత్రాలను లీనం చేసుకున్నప్పుడే



సమాజములో పరిపూర్ణ మానవులుగా తీర్చిదిద్దబడతాం. అశేషమైన భారతావనిని ఒకే తాటిపైకి తెచ్చి సమైక్య దేశముగా తీర్చిదిద్దడములో వీరి కృషి స్లాఘనీయమైనది.ఆ మహనీయుల త్యాగాలను అనుక్షణం నెమరువేసుకుంటూ, మరింత భాద్యతాయుతముగా ప్రజలకు సేవ చేయాలని పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, రిశాంత్ రెడ్డి ఐపీఎస్ ,%చీమా% మూర్తి ,%ాఎణ% ప్రసాద్ ,డిఎస్పీలు కమలాకర్,చిన్ని కృష్ణాలు,సీఐలు శ్రీనివాసరావు, విజయ చంద్ర లు,ఆర్ఐలు రమణ రెడ్డి,రమేష్ కృష్ణన్,వెంకట రమణ ,ప్రేమ కుమార్,రాజ్ కుమార్,రవి కిరణ్,ఇతర అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యంత ఘనంగా గాంధీ జయంతి వేడుకలు




చీరాల(ఒంగోలు) అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: : చీరాల నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రాంతాల లోనూ గాంధీ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారురోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా ఎన్.ఆర్ అండ్ పి.యం. హైస్కూల్ ఆవరణలో, నల్ల గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గల, మహాత్మాగాంధీ విగ్రహాలకు, పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం చీరాల ఏరియావైద్యశాలలోని, రోగులకు పండ్లు,బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు దోగుపర్తి వెంకటసురేష్, సెక్రటరీ పోలుదాసు రామకృష్ణ, కోశాధికారి బి.బాలగోకుల్‌కుమార్, ప్రముఖ సీనియర్‌న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, యం.వి.రామారావు, చీరాల కృష్ణమూర్తి,మామిడాల శ్రీనివాసరావు, దేగల తిరుపతిరావు, ఆంజనేయులు, వి.బి.వి సత్యనారాయణ, లక్ష్మీ ప్రతాప్,రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

– వాసవిక్లబ్స్ క్షీరపురి,చీరాల వారి ఆధ్వర్యంలో గాంధీజయంతి సందర్భంగా నల్లగాంధీ బొమ్మ సెంటర్‌లోని, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో వాసవి క్లబ్ క్షీరపురి చీరాల ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి,నూట యాభై రెండవ జయంతిని పురస్కరించుకుని, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్,ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో,పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులపై అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ, పన్నెండు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని జాతిపితకి అందచేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సభ్యులు.నారాయణమ్సాయి,పట్టణాధ్యక్షులు కోండ్రు కిరణ్,చందు,బద్రి,దుర్గాప్రసాద్, చంద్రకాంత్,ఆనంద్,సుధాకర్, ఆంజనేయులు, గోపి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సిగ్మా డయాగ్నస్టిక్స్ లాబ్ ను ప్రారంభించిన డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు



నరసరావుపేట, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి : నరసరావుపేట పట్టణంలో స్థానిక మోర్ సెంటర్ లో సిగ్మా డయాగ్నస్టిక్స్ లాబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు.నరసరావుపేట పట్టణంలో స్థానిక మోర్ సెంటర్ లోని కరూర్ వైశ్య బ్యాంక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సిగ్మా డయాగ్నస్టిక్స్ ల్యాబ్ ని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డా.చదలవాడ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నరసరావుపేట పట్టణం వైద్యపరంగా ఉపయోగకరంగా ఉంటుందని,నరసరావుపేట హెల్త్ సెంటర్ గా ప్రసిద్ధి చెందుతుందన్నారు.సిగ్మా డయాగ్నస్టిక్స్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, నరసరావుపేట మండల పార్టీ అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి పార్లమెంట్ అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు,తెలుగు యువత నాయకులు శాఖమూరి మారుతి,యంపరాల ఖాసిం,పఠాన్ ఖాసీం మరియు నరసరావుపేట ప్రముఖ డాక్టర్లు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ 152వ జయంతి వేడుకలు



నందిగామ అక్టోబర్ రెండు ప్రజా పాలన ప్రతినిధి పట్ట ణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ 152 వ జయంతి వేడుకలను శని వారం ఘనంగా నిర్వహించారు ,ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి ,గాంధీ సెంటర్ లోని జాతిపిత వి గ్రహానికి శాసనసభ్యుడు మొండితోక జగన్ మోహన్ రావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఏ ముఖ్య మంత్రి చేయని విధంగా గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యే యంగా పనిచేస్తూ మహాత్మాగాంధీ నిజమైన వారసు డిగా నిలిచారని ,బాపూజీ కలలు కన్న గ్రామస్వ రా జ్యం, సుపరిపాలన అందించేలా వైయస్ జగన్ పని చేస్తున్నారని తెలిపారు.జాతిపిత మహాత్మా గాంధీ నిరాడంబరతే నిజమైన నాగరికత అని చాటి చెప్ప డమే కాకుండా అహింస, సత్యం అనే ఆయుధాలతో భారతావనికి స్వాతంత్ర్యం సాధించి పెట్టారని డా" జగన్ మోహన్ రావు పేర్కొన్నారు ,మహాత్ముని పోరా టాలతోనే నేడు భారతీయులంతా ప్రజాస్వామ్య దే శంలో జీవనం సాగిస్తున్నారని చెప్పారు ,గాంధీ తన జీవితాన్ని సత్యశోధనకే పరిమితం చేశారని ,ఆయన చూపిన మార్గంలో నేటి యువత ప్రయనించాలని సూచించారు ,ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్య తలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజలకు విలువలు, విశ్వసనీయత తో కూడిన పాలన అందిస్తున్నారని తెలిపారుఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ,నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యులు ,వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాత్ముని ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

### నరసరావుపేట ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు



గుంటూరు, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: మహాత్మా గాంధీ ఆశయ సాధనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. శనివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, గొప్పదేశ భక్తులు మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని.. గుంటూరు, విద్యానగర్‌లోని ఎంపీ పార్టీ కార్యాలయం నందు వారి చిత్రపటానికి శ్రీకృష్ణదేవరాయలు, వైసీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మహాత్ముని కల గ్రామ స్వరాజ్య స్థాపకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని, గ్రామాల్లోనే అన్ని సేవలు అందించేలా గ్రామసచివాలయం వంటి సేవలను తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ముఖ్యనేతలు మర్రిరాజశేఖర్, మక్కెన మల్లిఖార్జున, ఇంటూరి బాబ్జీనంద తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్ కేర్ హాస్పిటల్ వైద్యులను, సిబ్బందిని ఘనంగా సత్కరించిన శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ అక్టోబర్ రెండు ప్రజా పాలన ప్రతినిధి:పట్ట ణంలోని వై.ఎస్.ఆర్ కోవిడ్ కేర్ హాస్పిటల్ ఆవరణలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యు లు మరియు వైద్య సిబ్బందిని శాసనసభ్యులు మొం డితోక జగన్ మోహన్ రావు గారు ఘనంగా సత్కరిం చారు ,కోవిడ్ కేర్ హాస్పిటల్ లో కరోనా వైద్య సేవలకు ముగింపు పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహన్ రావు ప్రశంసాపత్రాలు అందజే శారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సెకండ్ వ్యాప్తి ఉధృతంగా ఉన్న తరుణంలో ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో నం దిగామలో డాక్టర్ వైయస్ఆర్ కోవిడ్ కేర్ హాస్పిటల్ ను 50 ఆక్సిజన్ బెడ్ లతో ఏర్పాటు చేసి నియోజ కవర్గంలో కోవిడ్ బాధితులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించటం ఒక శాసనసభ్యుడి గానే కాకుండా ,ఒక డాక్టర్ గా కూడా తనకు ఆత్మ సం తృ ప్తినిచ్చే విషయమని తెలిపారు ,కరోనా సోకింది అని తెలియగానే కుటుంబ సభ్యుడైన సాటి మనిషిని కూ డా తాకలేని భయానక సమయంలో తమ ప్రాణాల ను పణంగా పెట్టి బాధితులకు అండగా నిలిచి వైద్యు లు మరియు వైద్య సిబ్బంది అందించిన సేవలు వె ల కట్టలేనివని తెలిపారు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సెకండ్ వేవ్ సమయంలో వేగంగా వ్యాప్తి చెం దుతూ కోరలు చాస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సమర్థవంతంగా కరోనా ను ఎదుర్కొని ప్ర జలలో ధైర్యం నింపుతూ ,కోవిడ్ చికిత్సను ఆరోగ్య శ్రీలో చేరుస్తూ ఉచిత వైద్యం అందించేలా నిర్ణయం తీసుకొని దేశమంతటికీ ఆదర్శంగా నిలిచారని ,ఎంత డబ్బు ఉన్నా ప్రాణాలను కాపాడుకోలేని దుస్థితిలో వైద్యులు- వైద్య సిబ్బంది దేశానికి ఊపిరి పోశారని, నేడు మరల సాధారణ జీవనం గడుపుతున్నామంటే అది వారి పుణ్యమేనని తెలిపారు ,నందిగామ కోవిడ్ కేర్ హాస్పిటల్ లో దాదాపు 400 మంది కోవిడ్ బాధి తులకు ఉచితంగా వైద్య అందించడం జరిగిందని చె ప్పారు.అనంతరం కోవిడ్ కేర్ హాస్పిటల్ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించి ,సొంత నిధులు వెచ్చించి , నియోజకవర్గ ప్రజలలో కరోనా బాధితులకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే నగర పంచాయతీ చైర్మన్ మండవ వరలక్ష్మి ,కమిషనర్ డా క్టర్ జయరామ్ ,ఎమ్మార్వో చంద్రశేఖర్ ,సిఐ కనకారా వు ,గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్ కమల మ రియు ఇతర వైద్యులు -వైద్య సిబ్బంది ఘనంగా స త్కరించారు ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కౌ న్సిల్ సభ్యులు ,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విశాఖలో ఆతిధ్యం అందుకున్న సామినేని ఉదయభాను



పెనుగంచిప్రోలు అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట నియో జక వర్గ శాసనసభ్యులు సామినేనిఉదయభాను విశాఖ పట్నం విచ్చేసిన సంధర్భంగా వారికి ఘన స్వాగతం పలుకుతూ వారిని వేల్పుల విజయకుమార్ స్వగృహంలో శాఖమూరి సాత్యకి ప్రసాద్ ,వేల్పుల విజయ కుమార్ ఎఇఎల్సీ చర్చి విశాఖ చెందిన పాస్టర్లు,చర్చి పెద్దలు ఘనంగా సన్మానించారుఈసంద ర్భంగా రెవ రెండ్.సుందర్శనరావు ప్రత్యేక పార్ధనలు నిర్వహించి ఆ పరిశుద్ధ ప్రభువైన యేసుక్రీస్తు వారి కృపతో రాను న్న దినముల యందు మరింత గొప్ప నాయకునిగా ఎదగాలని, తమ సేవలను దేవుని ప్రజలకు అందివ్వా లని దేవుని ఆశీస్సులు అందించారు.ఈకార్యక్ర మం లో విశాఖ లూథరన్ పాస్టర్లు రెవ.శ్యామ్ కుమార్ ,రె వ.జాకెట్ రాజ్ ,రెవ. సుముయోను,లూథరన్ చర్చి చైర్మన్ వేదాల డైజీబాబు గారుతదితరులు పాల్గొన్నా రు.

## ఏపీ యూ డబ్ల్యూ జే ఆధ్వర్యంలో గుంటూరు లో నిరసన



గుంటూరు, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: గుంటూరు పట్టణంలోని జిన్న టవర్ సెంటర్ లో ఉన్న బాపూజీ విగ్రహం వద్ద ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత పోలీసులు ర్యాలీకి అనుమతి లేదని అడ్డుకోవడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి భక్తవత్సల రావు ఏకే మోహన్ రావు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఎన్ మీరా, %ఎ% శివ , గిరిధర్ నగర కమిటీ కార్యదర్శి ఫణి కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కార్తీక్, జాయింట్ సెక్రెటరీ బి శ్యామ్, ఉపాధ్యక్షుడు ఎస్.కె రాజా, దశరథరామిరెడ్డి,సుభాని, సుబ్బారావు సుజిబాబు,తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో,గాంధీ జయంతి మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



చీరాల(ఒంగోలు) అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: : గాంధీ జయంతి మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా, చీరాలబిజెపి ఆధ్వర్యంలో, నల్ల గాంధీ విగ్రహమునకు మరియు లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటమునకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నేత ప్రముఖ సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు మువ్వల వెంకటరమణారావు, శంకరశెట్టి నాగేశ్వరరావు, వారణాసిమల్లికార్జునరావు,కర్రాశ్రీకాంత్, అరవపల్లి కుమార్, నాశన మణికుమార్, గుండపు రాజు, శవనం రామస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ కొరకుయాక్టీవ్ యన్.జి. ఓ సంస్థలు భాగస్వామ్యం కావాలి: కడప ఎంపీ. వై యస్. అవినాష్ రెడ్డి.




నరసరావుపేట, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: కడప రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ ప్రాంతీయ అధ్యక్షులు జి.వెంకట రమణ ఆధ్వర్యంలో బద్వేల్ లో నెల్లూరు రోడ్డు లో గల సాయి కళ్యాణమండపంలో కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్. అవినాష్ రెడ్డి ని యన్. జి. ఓ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యన్.జి. ఓ సభ్యులు ఆకుల వెంకట సుబ్బయ్య, బి. చంద్ర, కె. రాము లు యమ్. పి అవినాష్ రెడ్డి కి, కడప మేయర్ కె. సురేశ్ బాబు, యమ్. యల్. సి గోవిందరెడ్డి ల కు శాలువతో సత్కరించి మెమెంటో అందజేశారు. రోడ్డు భద్రత పోస్టర్ విడుదల చేశారు. రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ కడప జిల్లా అధ్యక్షుడు యంపీ కి లెటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా యమ్. పి మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ కొరకుయాక్టీవ్ యన్.జి. ఓ సంస్థలు భాగస్వామ్యం కావాలి అని ముఖ్యంగా మహిళఆధ్వర్యంలో నిర్వహించే రోడ్డు సేఫ్టీ యన్. జి ఓ సంస్థ కడపజిల్లా లో తమ కమిటీ బాగా పనిచేయాలి అని, ఈ రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ సంస్థ నుండి కడపజిల్లా రహదారి భద్రతా కమిటీ లో మెంబర్ గా అవకాశం కలిపించుతాము అని పేర్కొన్నారు ఈ సందర్భంగా యమ్‌పి అవినాష్ రెడ్డి కి యన్ .జి. ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ బంగారయ్య ధన్యవాదాలు తెలిపారు.

## మహాత్ముల కలలు నెరవేరాలంటే, పాలకులలో చిత్త శుద్ధి ఉండాలి:మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య



నందిగామ అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: నందిగామ పట్టణ రైతు పేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం నం దు జాతిపిత మహాత్మా గాంధీమరియు భారత మా జీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భం గా మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్యవారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పిం చా రు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూజాతిపిత మహాత్మ గాంధీ గారు భారత దేశమే కాదు యావత్ ప్రపంచం యొక్క స్థితిగతులను మార్చిన మహోన్నత వ్యక్తి అని అన్నారు.అహింసనే ఆయుధంగా మార్చు కుని శాంతియుత మార్గంలో ఆయన ప్రయాణం సాగి నదన్నారుఅలాగే లాల్ బహదూర్ శాస్త్రి చాలా నీతి నిజాయితీలకు కట్టుబడి భారతదేశ పరిపాలన చేశా రన్నారుఎందరో మహాత్ములు చూపిన మార్గంలో మ నమందరం నడిచి భారతదేశం యొక్క కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో రోడ్లన్ని జలమయం.. గుంతలమయం: రేఖగౌడ్

**మరమ్మతులకు నోచుకోక అస్తవ్యస్తంగా మారినా రహదారులు రోడ్లపై శ్రమదానం చేసిన జనసైనికులు**




గోనెగండ్ల అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారి పిలుపు మేరకు గోనెగండ్ల రోడ్ల మీద శ్రమదానం చేశారు జనసేన కార్య కర్తలు రాష్ట్ర వ్యాప్తంగా అస్తవ్యస్తంగా మారిన రహదారులకు మరమ్మతులు చేయాలని జనసేనపార్టీ ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు కోరినా డిమాండ్ చేసిన ఫలితం లేకనే జనసైనికులు ఏకంగా రోడ్లు ఎక్కి శ్రమదానం చేస్తున్నారని జనసేనపార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జి రేఖగౌడ్ తెలిపారు, మండల కేంద్రమైన గోనెగండ్లలో శనివారంరోజు ఎమ్మిగనూరు కర్నూలు ప్రధాన రహదారి జలమయమై గుంతలు ఏర్పడి ఏళ్ళు గడుస్తున్న పాలకులకు కనపడటం లేదన్నారు, ఇలాంటి రోడ్ల మీద అత్యవసరంగా వెళ్లే అంబులెన్స్ మరియు ద్విచక్ర వాహనదారులు పెద్దగా ఏర్పడిన గుంతలు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు, సంక్షేమ పథకాలను ఆసరాగా చేసుకొని సామాన్యుల నిత్యావసర ధరలు ఆకాశాన్ని పెంచారని అభివృద్ధిని విస్మరించారని ఇదేంటని ప్రశ్నిస్తే భౌతిక దాడులు అక్రమ అరెస్టులా అని ప్రశ్నించారు, ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం యువత ఎదురుచూస్తుందని వారి జీవితాలతో కూడా ప్రభుత్వం చెలగాటం ఆడుకోవడం దారుణమన్నారు, సంక్షేమ పథకాలు కొందరికి చేరువైతే అభివృద్ధి అందరికి దూరం చేస్తారా అని విమర్శించారు, ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ చేనేత రాష్ట్ర కార్యదర్శి రవి ప్రకాష్, నియోజకవర్గ మీడియా ఇంచార్జి గానిగ బాషా, గోనెగండ్ల మండల ప్రచార కార్యదర్శి ఖాసీం సాహెబ్, కార్యదర్శులు, రామంజి,మాలిక్, భాస్కర్, షఫీ, ఎంపిటిసి అభ్యర్థి సుగురూ షాహిన్,అల్వాల షేట్, ఎల్లప్ప, పవర్ స్టార్ రాజు, వీర మహిళలు, పద్మావతి, గాయత్రి, జనసేనపార్టీ కార్యకర్తలు గౌండ మాబాష, రవికుమార్,హనుమంతు, ఆంజనేయులు, పాల్గొన్నారు,

## జొన్నలగడ్డలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



నరసరావుపేట, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ సచివాలయంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి,పింఛన్ పంపిణీ కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ,ఎంపీపీ మోరబోయిన శ్రీనివాస్ రావు , తన్నీరు శ్రీనివాసరావు , మరియు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ నాయకులు.

## అనుసరణీయం బాపూజీ జీవనమార్గం



నరసాపురం, అక్టోబరు 2 (ప్రజాపాలన ప్రతినిధి) :అహింసే ఆయుధంగా దేశంకోసం, ధర్మంకోసం, శాంతికోసం పోరాడిన పూజ్య బాపూజీ జీవనమార్గం ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమని నరసాపురం సబ్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, అహింసావాదిగా యావత్ భారతాన్ని ప్రభావితం చేసిన ఆయన వ్యక్తిత్వం, ఉద్యమ కార్యాచరణ ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం 152 వ జయంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి సబ్ కలెక్టర్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యసమరంలో భాగంగా అహింసా మార్గాన్ని ఎంచుకుని ఆయన నమ్మిన అహింసా సిద్ధాంతంతోనే తెల్లదొరలను తరిమికొట్టారని అక్టోబర్ 2 గాంధీ జయంతి జరుపుకుంటున్నామని అన్నారు. బాపు జీవితం, ఆదర్శాలు దేశంలోని ఇప్పటి, రాబోయే తరాలకి మంచిమార్గంలో నడవడానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయని విష్ణు చరణ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి యస్.వి.సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ లు పి.నాగప్రసాద్, జ్యోతి, దుర్గ, వరలక్ష్మి ,మూర్తి, చైతన్య, బి.సురేఖ, సర్వే విభాగం కె. శ్రీనివాస్, సిబ్బంది భార్గవ, కోటేశ్వర రావు, సత్యనారాయణ, నారాయణ, అంజిబాబు, బాలాజీ, సమాచార శాఖ సిబ్బంది చించిలి శ్రీనివాస నెహ్రూ, రెడ్డి వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## జైకిసాన్ స్ఫూర్తితో రైతును రాజును చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిది: ఎమ్మెల్యే మల్లాది విష్ణు

**మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ పాలన**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ వ్యాప్తంగా మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంత్యోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కస్తూరిభాయిపేటలో జరిగిన వేడుకలలో స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత రమేష్ తో కలిసి శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని మహాత్ముల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారిలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి అగ్రగణ్యులన్నారు. మానవాళి ఉన్నంత వరకు వారి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆ మహాత్ములు బోధించిన సత్యం, అహింసా ఎంతో ఉన్నతమైనవని పేర్కొన్నారు. ఆ మహనీయుల ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకమని.. వారి ఆశయ సాధనకు వైఎస్సార్ సీపీ ఆదినుండి కృషి చేస్తోందన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ నేడు ప్రతి కుటుంబంలో ఒక భాగంగా మారిందన్నారు. రాష్ట్ర చరిత్రలో గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆచరణలో చూపిన ఏకైక నాయకులు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని మల్లాది విష్ణు తెలిపారు.జై జవాన్ జై కిసాన్ నినాదంతో దేశాన్ని ఒక్కటిగా నిలిపిన ధీరోదాత్తుడు లాల్ బహదూర్ శాస్త్రి అని మల్లాది విష్ణు కీర్తించారు. ఆయన స్ఫూర్తితో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో రైతు పక్షపాత ప్రభుత్వాన్ని నెలకొల్పారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా దిగిపోయేనాటికి రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఊహించలేమన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు అంటే దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పండగ చేసి చూపారన్నారు. ఆ మహానేత కుమారుడు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయానికి చేయూతనిచ్చి రైతును రాజును చేశారన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పాలన పగ్గాలు చేపట్టిన రెండేళ్లలోనే రాష్ట్రం ఊహించని ప్రగతి సాధించిందని.. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమాలు జరుగుతాయన్నారు. ఆ మహాత్ముల స్ఫూర్తితో గ్రామ స్వరాజ్యస్థాపనకు మనమంతా కృషి చేయాలని, వారి ఆశయాల సాధన కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బెల్లపు వెంకట్రావు, బెల్లపు సత్యనారాయణ, వెంకట్రామిరెడ్డి, కాజా శంకర్, బద్దేటి ఇస్సాక్, డి.శ్రీను, బొంగరాల భాస్కర్ రావు, శ్రీలక్ష్మి, గౌతమ్, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్లమెంటరీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు



నరసరావుపేట, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: మహాత్మాగాంధీ 152 వ జయంతి సందర్భంగా నర్సారావు పేట పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు యువత మరియు మహిళా నేతలు గాంధీజీ చిత్రపటం కి నివాళులర్పించడం జరిగింది ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో హింసకు తావు లేకుండా అహింసా మార్గంలో స్వాతంత్రం తెచ్చిన మహానుభావుడు జాతిపిత మహాత్మా గాంధీని నాయకులు ప్రసంగించారు సత్యాగ్రహం ఆయుధంగా మార్చుకుని బ్రిటిష్ లను దేశం నుంచి తరిమి కొట్టిన మహా యోధుడు మహాత్మా గాంధీ ఈనాటి భారత యువతా గాంధీ మార్గం అనుసరించి వారి ఆశయాలను సిద్ధాంతాలను అనుగుణంగా మలుచుకుని భారత దేశ అభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్ బాబు, పార్లమెంట్ కార్యదర్శి కోటా కిరణ్, నరసరావుపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కోట ప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వల్లెపు నాగేశ్వరావు ,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు మన్యం షరీఫ్ , పార్లమెంట్ మైనారిటీ షేక్ మహబూబ్, యాడ్ వల్లి మహమ్మద్ రఫీ , 13వ వార్డు ఐ టి డి పి సుధీర్ రాజేష్ షరీఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

## మహాత్మునికి నివాళులర్పించిన తెదేపా నేతలు



నరసాపురం, అక్టోబర్ 2 (ప్రజాపాలన ప్రతినిధి) : మహాత్మా గాంధీ 152 వ జయంతిని పురస్కరించుకుని శనివారం తెదేపానేతలు మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఏ షరీఫ్, నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజు, సీనియర్ నేత కొవ్వలి రామ్మోహన్ నాయుడు తదితరులు స్థానిక శివాలయం సెంటర్లోని గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హింస కన్నా అహింసే గొప్పదని నమ్మి దానిని ఆచరించి చూపించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడు గాంధీ మహాత్ముడని అహింసే ఆయుధంగా దేశంకోసం, శాంతి కోసం పోరాడిన బాపూజీ జీవనమార్గం అనుసరణీయమని మహాత్ముని సేవలను కొనియాడారు. అంతకుముందు తెదేపా వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పసుపులేటి రత్నమాల మాజీ వైస్ చైర్మన్ పొన్నాల నాగబాబు పార్టీ నాయకులు రాయుడు శ్రీరాములు, కొప్పాడ రవీంద్రనాథ్, భూపతి నరేష్, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, అధికారి అనంతరామారావు, మేడిది రాము, గునిశెట్టి రామకృష్ణ, సంకు భాస్కర్ నాయుడు, మల్లాడి మూర్తి, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్ బాబు, అప్పన రమేష్, కోరాడ పాపారావు, హుస్సేన్, చల్లా పద్మావతి, అబేదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## యూరినరీ బ్లాడర్ క్యాన్సర్ బాధితునికి కోడూరు రెడ్ క్రాస్ సొసైటీ ఆర్థిక చేయూత



కోడూరు, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని నరసింహపురం గ్రామానికి చెందిన గుంటూరు బాబురావు అనే వ్యక్తి కొంతకాలంగా యూరినరీ బ్లాడర్ క్యాన్సర్ తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కోడూరు మండల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు వారి ఆధ్వర్యంలో దాతలు ఎ.ఎస్.ఐ ఆంజనేయులు, మందపాకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మృదుల, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, కోడూరు మండల రెడ్ క్రాస్ చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, జొన్న రవిశంకర్ గుప్త దాతల సహకారంతో శనివారం బాధితునికి వైద్య ఖర్చుల నిమిత్తం 3500/- రూపాయల నగదు 25 కేజీల బియ్యం, నెలకు సరిపడా సరుకులు, కూరగాయలు, ఫ్రూట్స్ అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రస్తుతానికి బాబురావు కి మందులు సర్జికల్ పరికరాల నిమిత్తం నెలకు పదివేలు ఖర్చు అవుతుందని వారిది నిరుపేద కుటుంబం కావడం వల్ల మందుల అవసరాలకు దాతలు సహకారాన్ని అందించాలని కోరుతున్నారు. ఈకార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు రేపల్లె యోగ ప్రకాష్ కొండవీటి సురేష్ పాల్గొన్నారు.

## గాంధీజీకి వినతి పత్రం అందించిన బంటుమిల్లి జర్నలిస్టులు



బంటుమిల్లి అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్న దన్ని ఏపీయూడబ్ల్యూజే నాయకులు అన్నారు రాష్ట్ర పిలుపుమేరకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బంటుమిల్లి లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ముందుగా అంబేద్కర్ సెంటర్ నుండి జర్నలిస్టులు ప్రదర్శనగా బయలుదేరి పోలీస్స్టేషన్లో శ్రీనివాసరావు కు వినతిపత్రం అందించి గాంధీబొమ్మ సెంటర్లో ఉన్న గాంధీజీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు ఈ సందర్భంగా ఏ పి యు డబ్ల్యూ జే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శర్మ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి నాడు జర్నలిస్టు దినంగా పాటిస్తూ తమ ఆవేదనను ప్రభుత్వానికి వ్యక్తపరుస్తున్నా మన్నారు విలేకరులను ఫ్రంట్లైన్ వా రియర్స్ గుర్తించాలని కోవిడ్ తో మరణించిన జర్నలిస్టులకు 50 లక్షలు అందించాలని ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందించాలని బీమా సౌకర్యం కల్పించాలని జర్నలిస్టుల కు స్థలాలు మంజూరు చేయాలని జర్నలిస్టుల పై అక్రమ కేసులు అరికట్టాలని అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పులి మల్లికార్జున రావు ఒక్క పాటే శివ ప్రసాద్ దాసరి జోజి బాబు కాగిత రాంబాబు గొల్లప్రోలు రామాంజనేయులు కృష్ణమూర్తి సిపిఎం పార్టీ నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## కారాగారాలు మంచి పరివర్తనను తెచ్చే ఆలయాలు



నరసాపురం, అక్టోబర్ 2 (ప్రజాపాలన ప్రతినిధి) : జైళ్లలో ఉన్నవారు నేరస్తులు కారని కేవలం నిందితులేనని తెలుగుదేశం పార్టీ నేత కొవ్వలి రామ్మోహన్ నాయుడు (ఎన్నారై) అన్నారు. గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా శనివారం నరసాపురం ఉప కారాగారంలో ఏర్పాటు చేసిన వితరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కారాగారాలు మానసిక పరివర్తన తెచ్చే ఆలయాలని ఆయన పేర్కొన్నారు. తప్పు చేసిన వారు, చేయనివారు కూడా వేరువేరు సందర్భాల్లో ఇక్కడకు రావడం జరుగుతుందన్నారు. కారాగారాలు ద్వారా మానసిక పరివర్తనచెందిన ఎందరో సామాజిక సేవా తత్పరులులా మారినవారి సంగతులను గుర్తుచేశారు. కార్యక్రమానికి ఉప కారాగార పర్యవేక్షకులు అప్పారావు అధ్యక్షత వహించి కొవ్వలి రామ్మోహన్ నాయుడు సేవలను కొనియాడారు. రూ 40 వేలు విలువగల కంప్యూటర్ పరికరాలను తమ కార్యాలయానికి వితరణ చేయడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పొన్నాల నాగబాబు, కోటిపల్లి కన్నబాబు, గుగ్గిలపు బుజ్జిబాబు, సంకు భాస్కరనాయుడు, మల్లాడి మూర్తి, జక్కం కాశీ, సందక సురేష్, పొన్నమండ మురళి, ఉప కారాగార సిబ్బంది యం హరిబాబు, కె శ్రీనివాసరావు, కె కృష్ణ కిషోర్, డి కార్తీక్ బాబు, వై మల్లేశ్వర్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు..

## బాపూజీకి నివాళులర్పించిన మునిసిపల్ కౌన్సిల్



నరసాపురం, అక్టోబర్ 2 (ప్రజాపాలన ప్రతినిధి) : మహాత్మా గాంధీ152 వ జయంతి సందర్భంగా నరసాపురం మునిసిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మహాత్ముని అడుగుజాడలలో నడవాలని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్రజలందరూ గుడ్డసంచులను, జూట్ బ్యాగులను వినియోగించాలని ప్లాస్టిక్ వాడకంపై కలిగే హానిగురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కావలి రామసీత, కస్తూరి ఇందిరాదేవి, చిట్టూరి వెంకటపద్మ, ద్వారాగంగాభవాని, గొల్ల జయరాజ్ సింగ్, తాడి సునీత, సిర్రా కాంతమ్మ, చింతా మాలతి, కోఆప్టేడ్ మె%శీ%బర్ అభేదా సుల్తానా, ఇన్చార్జి కమిషనర్ శిరిగినీడి శివాజీభాస్కర్, చిన్నారావు, లాల్ షరీఫ్, ఏఈ సునీల్, సత్యనారాయణ, మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎదుటివారికి సహాయం చేసి తిరిగి ప్రతిఫలం ఆశించకుడదు: ఉమానంద రెడ్డి



గోనెగండ్ల అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: మండలకేంద్రమైన గోనెగండ్లలో జాతిపిత "మహాత్మా గాంధీ" గారి 152వ జయంతిని పురస్కరించుకుని మహాత్మా గాంధీ విగ్రహానికి రైతు బాంధవుడు, శాసన సభ్యులు "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" మరియు మన ప్రియతమ నాయకులు, పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" అదేశాల మేరకు ఉమానంద రెడ్డి తిక్కయ్య స్వామి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు.ఉమానంద రెడ్డి మాట్లాడుతూ ఎదుటివారికి సహాయం చేసి మనం ప్రతిఫలం ఆశించకూడదు,అని అన్నారు అలాగే తిక్కయ్య స్వామి మాట్లాడుతూ పక్కవారికి మంచి చెయ్యకున్న పర్లేదుకాని హాని చెయ్యకూడదు అని అన్నారు అసత్యం, ద్వేషం, మోసం, ద్రోహం, నేరం... ఇవి ఇప్పుడు పూర్తి చెడుకు కారణం అవుతున్నాయి. స్నేహం, త్యాగం, సమభావన, సహ జీవనం ఇవి విలువైనవిగా మారాయి. విలువలే మనుషుల్ని మహనీయులని చేస్తాయి. గాంధీజీని గౌరవించడం అంటే విలువల్ని కాపాడుకోవడమే అని అన్నారు. తర్వాత రోగులకు పాలు పండ్లు బ్రేడ్లు పంచారు ఈ కార్యక్రమంలో తిక్కయ్య స్వామి,ఉమదానందరెడ్డి,ప్రభాకర్ రెడ్డి,పెయింట్ రహమాన్,మహేష్ బాబు,చింతపండు రహిమాన్,సిగిలిఖాజా,నరసింహా,నల్లారెడ్డి కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఈపూరుపాలెంలో జెడ్పీటీసీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు



చీరాల(ఒంగోలు) అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: చీరాల నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు, చీరాల వైస్సార్సీపీ జడ్పీటీసీ ఆకురాతి పద్మిని ఆధ్వర్యములో, ఈపూరుపాలెంలోని గాంధీ పార్కులోగల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి , జయంతి సందర్భముగా కేకు కట్ చేసి అందరికి పంచి పెట్టారు.గాంధీ విగ్రహానికి జడ్పీటీసీ తోపాటు, పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మిని మాట్లాడుతూ, చీరాల నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో,తాము ప్రజా సేవకు అంకితమవుతానని అవుతానని చెప్పారు. తనను గెలిపించిన చీరాల మండల ప్రజలకు జడ్పీటీసీ కృతజ్ఞతలు తెలిపారు..ఈకార్యక్రమములో ఏఎంసీ చైర్మన్ మార్పుగ్రెగొరీ, డైరెక్టర్ కనపర్తిబజ్జిబాబు , కౌన్సిలర్లు సల్లూరి సత్యానందం, దాసరి శ్రీనివాసులు, పాపిశెట్టి సురేష్‌నాయుడు, గుండాల వసంత్, ఉప్పులూరివిజయ్, భాస్కర్‌రెడ్డి, షేక్ రెహమాన్, యాతంవెరీబాబు, గాజుల శ్రీహరి, గంజి.వెంకటేశ్వర్లు, కాటూరి.వెంకటేశ్వర్లు, తిరువీధుల.ధనంజయ్, గవిని పిచ్చయ్య, మల్లారపు.కృష్ణారావు, మిర్యాల.శ్రీనివాసరావు, పఠాన్ ఇంతియాజ్ ఖాన్, యాతం క్రాంతి పాల్గొన్నారు.

– చీరాల ఎన్.ఆర్ అండ్ పి.యం. హైస్కూల్ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి, ఆయన నూట యాభై రెండవ జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మార్పు గ్రెగొరీ,రమేష్ బాబులు మాట్లాడుతూ,జాతిపిత మహాత్మాగాంధీ నూట యాభై రెండవ జయంతిని, చీరాల వైసీపీ ఇంచార్జి, మాజీఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సూచనల మేరకు, ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.మహాత్మాగాంధీ దేశంకోసం చేసిన సేవలు అమోఘమని,ఆయన పోరాటం వల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, సత్యం,అహింసలే ఆయన మార్గాలని,ఆయన బాటలోనే నడుస్తామని స్పష్టం చేశారు.చీరాల మాజీ మునిసిపల్ చైర్మన్ మోదడుగు రమేష్ బాబు,ఏ ఎం సి చైర్మన్ మార్పు గ్రెగొరీ, కౌన్సిలర్లు తదితరులుపాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం



చీరాల(ఒంగోలు) అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: : గాంధీజయంతి సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతులకు లోనైన రహదారులను గుర్తించి, శ్రమదానం చేయవలసినదిగా, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు, చీరాల నియోజకవర్గంలోని, చీరాల పట్టణం శృంగారపుపేట నందు, జనసేన పార్టీ నాయకులు తోట.రాజశేఖర్, అనుమకొండ కిషోర్ ఆధ్వర్యంలో, నాయకులు, జనసైనికులు పాల్గొని శ్రమదానం చేశారు.ముందుగా ఈ కార్యక్రమం చీరాల గుంటూరు మెయిన్ రోడ్ (ఈపురుపాలెం)లో చేయడానికి, జనసేన తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని, పోలీస్‌శాఖ వారు, ముందుగా చేయడం హర్షించదగ్గ విషయమని, అందువల్ల జనసేన పార్టీ వారు, చీరాల వాడరేవు రోడ్డులో గల శృంగార పేట రహదారిపై, కోర్టు ఎదురుగా ఉన్న రోడ్డు దగ్గర, రహదారులను సరి చేయడం జరిగిందన్నారు. జనసేన పార్టీ ప్రజలకు అందుబాటులో వుంటూ, సమస్యలు తమ దృష్టికి తీసుకోనివస్తే, వాటిని పరిష్కరించేదిశగా తాము ప్రయత్నిస్తామని, రాష్ట్ర ప్రభుత్వంలో ఇప్పటికైనా కదలిక రావడం మంచిపరిణామమని, జనసేనపార్టీ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల్లో రహదారులు కూడా, మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లాకార్యదర్శి గూడూరు శివరామప్రసాద్, సంయుక్తకార్యదర్శి తోట రాజశేఖర్, జనసేన పార్టీ నాయకులు అనుమకొండ కిషోర్, పాలవలస శ్రీనివాస్, ఏరిచర్ల అశోక్ కుమార్ మరియు జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ విగ్రహ పునః నిర్మాణ శిలాఫలకఆవిష్కరణ

### అవకాశం అదృష్టం: ఎమ్మెల్యే కరణం



చీరాల(ఒంగోలు) అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: : మహాత్మాగాంధీ వంటి మహానుభావుని విగ్రహ పునః నిర్మాణ శిలాఫలకం,ఆవిష్కరణ చేసే అవకాశం రావటం, అదృష్టంగా భావిస్తున్నానని, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు.చీరాల తెల్లగాంధీ బొమ్మ వద్ద, మహాత్మాగాంధీ 152 వ జయంతి కార్యక్రమంలో, శాసనసభ్యులు కరణం బలరాం మాట్లాడుతూ,శిలాఫలకం ఆవిష్కరణకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు,వైస్ చైర్మన్లు బోనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి వెంకట సుబ్బులు, రాష్ట్ర వైసిపీ కార్యదర్శి వరికూటి అమృతపాణి, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, యువనాయకులు కరణం వెంకటేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక రుగ్మతలను రూపుమాపడానికే చట్టాలు !!: జిల్లా జడ్జి జి.రామకృష్ణ

మచిలీపట్నం ,ప్రజాపాలన ప్రతినిధి :సామాజిక రుగ్మలతను రూపుమాపడానికే చట్టాలను రూపొందించడం జరిగిందని, మన సమీపంలో నెలకొని ఉన్న దుర్మార్గంను పారదోలి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడేందుకు అందరూ కృషి చేయాలని ని జిల్లా జడ్జి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి.రామకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్ జిల్లా న్యాయసేవల సాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్వచ్ఛంద సేవా సంస్థలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉచిత న్యాయ సేవల వివరాలు గూర్చి ప్రజలందరికి అవగాహన కల్పించేందుకు న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం నుండి మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్ వరకు పలువురితో ఒక భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం డి ఎల్ ఎస్ ఏ హాలో జరిగిన కార్యక్రమంలో జాతిపిత మహాత్మా గాంధీజీ , మన దేశ రెండవ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు నివాళులు సమర్పించారు. జ్యోతి ప్రజ్వలన తర్వాత న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ సిబ్బంది వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామకృష్ణ మాట్లాడుతూ, జిల్లా న్యాయసేవల సాధికార సంస్థ అవగాహన సదస్సులను నిర్వహించి ప్రజలందరికి చట్ట పరిజ్ఞానాన్ని పెంపొందిస్తోందని, ఉచితంగా లభించే న్యాయసేవలను అందరూ వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అక్టోబరు 2 వ తేదీ నుంచి నవంబరు 14వ తేదీ వరకు నిర్వహించే న్యాయసేవల ప్రచారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పౌరులంతా చట్టాలను తెలుసుకోవలని అవసరం ఎంతైనా వుందన్నారు. 1987 వ సం.లో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పడిందని, 1995 నవంబరు 9 వ తేదీన అమలులోకి రావడం జరిగిందని తెలిపారు. కోర్టు ఫీజు చెల్లించుకోలేని నిరుపేదలకు ఉచితంగా న్యాయాన్ని అందించే లక్ష్యంతేనే న్యాయ సేవాధికార సంస్థ ఏర్పడిందని తెలిపారు. కోర్టు ఫీజుతో పాటు కేసులను వాదించడానికి ప్రభుత్వ ఖర్చుతోనే అడ్వోకేట్ ను సైతం నియమించడం జరుగుతుందన్నారు. అత్యంత ధనవంతుడు పొందగలిగే న్యాయాన్ని అత్యంత పేదవాడు ఉచితంగా పొందే అవకాశం న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కలుగుతుందన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పొంది చిన్నతనం నుంచే చైతన్యవంతులు కావాలని జిల్లా జడ్జి అన్నారు. ఉలి దెబ్బలకు వెరవక ధైర్యంగా ఉన్న శిల దేవతామూర్తి గా ప్రతిష్టించబడినట్లుగా చదువు విషయంలో శ్రద్ధాసక్తులతో శ్రమించి చదువుకొన్నవారే ఉన్నత స్థానాలలో ఉండగలరన్నారు. పాఠశాలలు దేవాలయాలు అని పిల్లలు దేవుళ్ళని చెబుతూ, విద్యార్థినీ విద్యార్థుల శ్రేయస్సు కోసం ఉపాధ్యాయులు చెప్పిన మంచి మాటలు విననివారు అధమ స్థానాలలో ఉంటారన్నారు. 18 ఏళ్ల లోపు బాలబాలికలపై లైంగిక దాడులు, అత్యాచారాలు నిరోధించేందుకు 2012 నవంబరు 14న (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫ్‌నెన్స్ యాక్ట్) పోక్సోను రూపొందించిందని, ఎవరైనా బాలికలను తాకకూడని చోట తాకినా, అసభ్యకరమైన సంకేతాలు చేస్తున్నా, అశ్లీల చిత్రాలు, వీడియోలు చూపించినా, బాలికలకు లైంగిక వేధింపులకు గురిచేసినా, వారికి ఇష్టం లేకుండా శరీరాన్ని తాకినా.. అసభ్య పదజాలంతో మాట్లాడినా.. ఈవ్‌టీజింగ్ చేసినా పోక్సో కింద కేసు నమోదు చేస్తారని వివరించారు. నిందితుడు ఎంతటి వాడైనా అత్యాచారయత్నం, అత్యాచారం, హత్య చేస్తే పోక్సో చట్టం ద్వారా మరణదండన విధిస్తారన్నారు. పోక్సో కేసుల్లో నిందితులపై నాన్‌బెయిల్ వారెంట్లు జారీ చేయడంతో పాటు బెయిల్ ఇచ్చే అధికారాన్ని నేరుగా కోర్టులకే ఇచ్చారు. బాలికలు తమకు ఏదైనా ఆపద సంభవిస్తే, ఏ నెంబర్ కు ఫోన్ చేయాలో చెప్పండని ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులను ఉద్దేశించి జిల్లా న్యాయమూర్తి ప్రశ్నించారు. 1098 కు ఫోన్ చేస్తానని దీక్షిత అనే బాలిక సమాధానం చెప్పింది. 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలకు బాల్య వివాహం చేస్తే, పెళ్లి చేసినవారు, ఆ కళ్యాణానికి హాజరైనవారు సైతం కేసులలో చిక్కుకొంటారని జిల్లా జడ్జి హెచ్చరించారు. మహిళలు ఆపదలో రక్షణకోసం 100 నెంబరుకు తక్షణమే ఫోన్ చేయాలన్నారు. స్వీయ రక్షణకు అవసరమైన కోర్సులను నేర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా వుందన్నారు. ఎస్.సి, ఎస్.టి.లకు, మారు మూల ప్రాంత ప్రజలకు న్యాయంపై, అవగాహన కలిగించడం జరుగుతున్నదన్నారు. న్యాయ సేవాధికార సంస్థ సత్వర న్యాయాన్ని ఉచితంగా అందిస్తుందనే విషయాన్ని తమ బంధువులు, తల్లితండ్రులకు తెలియచేయాలన్నారు. ఆ తర్వాత పదవ అడిషనల్



జిల్లా జడ్జి ఎ. నరసింహమూర్తి మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, తద్వారా తమను తాము రక్షించుకునే అవకాశం కలుగుతుందన్నారు. హక్కుల ఉల్లంఘనపై ప్రశ్నించగల మన్నారు. బాలికల రక్షణకు అనేక చట్టాలు వున్నాయని, సమస్యలను ప్రారంభంలోనే తెలియచేసి సమస్య పెద్దది కాకుండా రక్షణ పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదవ అడిషనల్ జడ్జి కె. సీతారామకృష్ణారావు, డాక్టర్ ఎం.రామకృష్ణ, ప్యానల్ అడ్వకేట్ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు సి హెచ్ మునలయ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. రాజారామ్ , మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మెహర్ ప్రసాద్, పాన్ ఇండియా అవర్నెస్ అండ్ అవుట్ రీచ్ ప్రొగ్రమ్ తదితర స్వచ్ఛంద సభ్యులు, పలు కళాశాలల, హైస్కూళ్ళ విద్యార్థినీ విద్యార్థినులు, తదితరులు హాజరయ్యారు.

## ప్రభుత్వాలు జర్నలిస్టు వ్యతిరేక విధానాలపై చల్లపల్లిలో జర్నలిస్టుల నిరసన



చల్లపల్లి అక్టోబర్ 2 ప్రజాపాలన ప్రతినిధి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక వైఖరికి నిరసనగా ఐజేయూ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీయూడబ్ల్యూజే ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ పిలుపు మేరకు చల్లపల్లిలో గాంధీ విగ్రహం ముందు జర్నలిస్టులు నిరసన తెలిపారు. గాంధీజీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం ఏపీయూడబ్ల్యూజే కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి అడపా సాయిబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల కార్మిక చట్టం రద్దు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఐజేయూ జర్నలిస్టు నాయకులకు ప్రాతినిధ్యాన్ని కల్పించకపోవడం తో పాటు పలు విధానాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలు కూడా పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేంటనే స్పందించి కరోనాతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షల రూపాయలను వెంటనే ఇవ్వాలన్నారు. అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, అర్హత కలిగిన జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, హెల్త్ కార్డ్స్, యాక్సిడెంట్ ఇన్సూరెన్సులను కొనసాగించాలని, ఇళ్ళ స్థలాలు, పక్కా ఇళ్ళను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే దివి యూనిట్ ప్రధాన కార్యదర్శి గడ్డిపాటి సుధీర్ బాబు, నాయకులు కుంపటి బాబూరావు, కళ్లేపల్లి చంద్ర, సింహాద్రి జయరాం, పెనుమాక రోహిత్ పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహావిష్కరణ





చందర్లపాడు, అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: ఎంపియుపి పాఠశాల లక్ష్మీపురం లో వాసవి క్లబ్ వారి ద్వారా పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా గవర్నర్ బొడ్డు.శ్రీనివాసరావు స్థానిక మండల విద్యాధికారి బి బా లాజీ,ఎండిఒ,శ్రీనివాసరావు హాజరై నారు.ఈ సంద ర్భంగాబొడ్డు మాట్లాడుతూ గాంధీ జ యంతి రోజున అయన విగ్రహావిష్కరించడం ఎంతో ఆనందానిచ్చింద న్నారు .ప్రతిఒక్కరు ఆయనచూచిం చిన మార్గంలో నడవా లన్నారు.బాలాజీ మాట్లాడు తూ ఇలాంటి కా ర్యక్రమా లు చేయడం ఎంతో స్ఫూర్తి దాయకం అభి నందనీయ మన్నారు.ఈ పాఠశాలను ఇంత అభివృ ద్ధిపథంలోకి నడిపిన పాఠశాల సిబ్బందిని అభినందించారు.ఎండిఓ శ్రీనివాస మాట్లాడుతూ ఈ కార్యక్ర మం ఇంతగొప్పగా చేస్తున్నందుకు వాసవి క్లబ్ వారిని అభినందించారు ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరెన్నో చేయాలని కోరుకున్నారు.ఈ పాఠశాలనుఇంతఅభివృద్ధిచేసినప్రధానోపాధ్యాయురాలు ఆదూరి ఇందిరను అభినందించారు.ఇలాంటి ఉపాధ్యాయు రాలి సహకారంతో విద్యార్థులను భావి భారత పౌరు లుగా తయారు చేయాలన్నారు. ప్రధా నోపాధ్యాయు లు ఇందిర మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి వా రి ఉపాధ్యాయ సిబ్బంది గ్రామ ప్రజలు ఎంతో తోడ్పా టు అందించారన్నారు వారి సహకారం తోనే ఈ పా ఠశాల ఇలా అభివృద్ధిచెందినదన్నారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులు,తల్లిదండ్రులు గ్రామపెద్దలు తదితరు లు హాజరైనారు.

## యోగాతోనే మానసిక ఒత్తిడి దూరం: ఎమ్మెల్యే రమేష్‌బాబు



**ఘంటశాల,**అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: యోగాతోనే మానసిక ఒత్తిడి తొలగిపోతుందనీ స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. ఘంటశాల మండలం లంకపల్లి గ్రామంలో శ్రీ సత్యసాయి యోగాశ్రమంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని ఎమ్మెల్యే, దివిమార్కెట్ యార్డు చైర్మన్ కడవకొల్లు నరసింహారావు శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వాలంబనతోనే రాష్ట్రాభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో మానసిక ఒత్తిడి తొలగించి, శారీరక ఉల్లాసాన్ని పెంపొందించాలంటే యోగా ఒక దివ్యాస్త్రం అన్నారు. మానసిక ఒత్తిడి తగ్గించేలా ప్రతి గ్రామంలో యోగా శిక్షణ నిర్వహించాలనీ యోగా గురువు శ్రీనివాస్‌ను కోరారు. యోగా గురువు శ్రీనివాస్ తన సొంత గ్రామం లంకపల్లిలో 50 మందికి శిక్షణా కేంద్రం నిర్వహించటమేకాక, గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తుండటంతో ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. ముందుగా జాతిపితకు పూలదండ వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం యోగామెమోంటోలు ఎమ్మెల్యే, దివిమార్కెట్ చైర్‌పర్సన్‌కు అందించారు. మాజీ యం.పి. కొనకళ్ల నారాయణ, యం.పి.టి.సి. మాడెం నాగరాజు, సర్పంచ్ డి. విజయలక్ష్మీ, వై.సి.పి. మండల కన్వీనర్ వెంకట్రావ్, యువనేత ప్రవీణ్, ఎస్సై లక్ష్మీనరసింహమూర్తి, కో–ఆప్షన్ సభ్యులు మస్తాన్‌వలీ, అరుణ్‌కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ అధికారి రవీంద్ర,మహిళలు గ్రామస్థులు పాల్గొన్నారు.

## యర్రా కు శుభాకాంక్షలు తెలిపిన బండారు కుటుంబం



భీమవరం, అక్టోబర్ 2 (ప్రజాపాలన ప్రతినిధి) : మహాత్మాగాంధీ 152 వ జయంతి, అంతర్జాతీయ అహింసాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ సర్వోదయమండలి గాంధీజీ శాంతి పురస్కారం 2021 అవార్డును గాంధేయవాది యర్రా నారాయణస్వామికి అందజేసిన సందర్భంగా నరసాపురం మాజీ శాసనసభ్యులు బండారు మాధవనాయుడు కుటుంబ సభ్యులు బండారు ప్రతాప్ నాయుడు, బండారు వెంకట స్వామినాయుడు, బండారు పటేల్ రాజానాయుడు యర్రా నారాయస్వామిని శనివారం భీమవరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహనరావు, వేగి కుమార్ రత్నం, చల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలు



బంటుమిల్లి అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: బంటుమిల్లి మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు నాగ రామాంజనేయులు ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా బంటుమిల్లి లో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి గాంధీజీ పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు ముఖ్యఅతిథిగా కృష్ణాజిల్లా బిజెపి పార్టీ సెక్రటరీ గాజుల సిద్ధార్థ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సిద్ధార్థ తెలియజేశారు అందుకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో పార్టీ లీడర్స్ చూసుకోవాలన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నీ పుట్టినరోజు వేడుకలు అన్నిచోట్ల ఘనంగా నిర్వహిస్తున్నామని ఏదో ఒక చోట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షుడు రామాంజనేయులు జిల్లా నాయకులు గాజుల సిద్ధార్థ తెలియజేశారు బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు గాజుల సిద్ధార్థ చేతులమీదుగా పండ్లు పంపిణీ చేశారు అనంతరం పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో లో బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షుడు మురళా లా వెంకటేశ్వరరావు యువ మోర్చా నాయకులు రవీంద్ర బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి



చీరాల(ఒంగోలు)అక్టోబరు 02, ప్రజాపాలన ప్రతినిధి: : మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా, నల్ల గాంధీ బొమ్మ సెంటర్లోని గాంధీ విగ్రహానికి, తెలుగుదేశం పార్టీ చీరాల నియోజకవర్గ ఇంచార్జ్ యడం బాలాజీ సోదరుడు గోపాలం లక్ష్మీ దీపక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాలం లక్ష్మీ దీపక్ , కోరబండి సురేష్, గ్రంధి కిరణ్, తడవర్తి సాయి, బూదాటి వెంకట్రావు, ప్రదీప్, ప్రణీత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## మురుగదాస్ నుంచి మరో..

# సైన్స్ ఫిక్షన్ హీరోగా అల్లు అర్జున్!



టాలీవుడ్ స్టార్ హీరోలంతా ఇప్పుడు పాన్ ఇండియా కథలు కంటున్నారు. ఆ తరహా కథలు పట్టుకుని వస్తేనే కదులుతున్నారు. ఏ కథను ఎంచుకున్నా అది అన్ని భాషల వారికీ .. అన్ని ప్రాంతాల వారికి కనెక్ట్ అయ్యేదిగా ఉండాలి. కథ అందరికీ వర్తించేదై ఉండాలి .. కథా పరిధి ఎక్కువగా ఉండాలి .. బహుముఖాల్లో భారీతనం కనిపించాలి. అలా అనిపించాలంటే ఆయా భాషలకి చెందిన స్టార్లు ఆ సినిమాల్లో ఉండాలి. ఇలా తెలుగు సినిమా పాన్ ఇండియా సినిమాగా తన రూపురేఖలను మార్చుకుంటూ వెళుతోంది. ఆ వేగాన్ని అందుకోవడానికి స్టార్ హీరోలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.కొంతమంది దర్శక నిర్మాతలు జానపదాల్లోని .. పౌరాణికాల్లోని పాయింటును పట్టుకుని పాన్ ఇండియా సినిమాగా చెక్కుతూ ఉంటే మరి కొంతమంది తమకి దొరికిన కథను ఆ స్థాయిలో మలుస్తున్నారు. ఇప్పుడు తెరపై ఎలాంటి అద్భుతమైన దృశ్యాలనైనా ఆవిష్కరించవచ్చు. అంతలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. అందువలన ఫిక్షన్ సినిమాలకు తగిన కథలను కూడా రెడీ చేసుకుంటున్నారు. ప్రస్తుతం తమిళ దర్శకుడు మురుగదాస్ అలాంటి ఒక కథనే సిద్ధం చేసుకుంటున్నాడని అంటున్నారు.తమిళంలో ఒకప్పుడు ఈ హీరోను ఇలాగే చూపించాలి .. ఆ కథను అలాగే చెప్పాలి అనే ఒక మూస ధోరణి కనిపించేది. అలాంటి కథలు మన దగ్గర ఉడకవ్ అన్నట్టుగా ఒక కొత్త మార్పు తీసుకొచ్చిన దర్శకుడిగా మురుగదాస్ కనిపిస్తాడు.చూడటానికి రాముడు మంచి బాలుడిలా అనిపిస్తాడు. కానీ తెరపై హీరోలతో ఆయన చేయించే అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు. తమిళ సినిమాల పోకడను మార్చేయడమే కాదు ఇతర భాషా చిత్రపరిశ్రమల దృష్టిని సైతం ఆయన ఆకర్షించాడు. హిందీ నుంచి ఆమిర్ ఖాన్ పిలిచి 'గజిని' .. తెలుగు నుంచి చిరంజీవి పిలిపించి 'స్టాలిన్' చేయించారంటే ఆయన టాలెంట్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.అలాంటి మురుగదాస్ .. అల్లు అర్జున్ కి ఒక కథ వినిపించాడనీ ఆ కథపై తరచూ చర్చలు జరుగుతున్నాయనే టాక్ కొంతకాలంగా వినిపిస్తోంది. 'పుష్ప' తరువాత అల్లు అర్జున్ చేయనున్న సినిమా కూడా ఇదేననే టాక్ వచ్చింది. అలా అందరూ చెప్పుకుంటున్న ఆ ప్రాజెక్టు ఇంకా చర్చల దశలోనే ఉందట. ఇది కథ ఫిక్షన్ జోనర్ కి సంబంధించినది కావడమే ఆలస్యానికి కారణమని అంటున్నారు. గతంలో మురుగదాస్ చేసిన '7%ష్ట్ర% సెన్స్' తరహాలో ఈ సైన్స్ ఫిక్షన్ ఉంటుందనే టాక్ బయటికి రావడం ఇప్పుడు ఈ ప్రాజెక్టుపై ఆసక్తిని పెంచుతోంది.ఈ ఫిక్షనల్ సినిమాలో అల్లు అర్జున్ ను ఆయన చాలా డిఫరెంట్ గా చూపించనున్నాడని అంటున్నారు. ఫిక్షనల్ పాత్రలో తెరపై ఆయన చేసే యాక్షన్ సీన్స్ ఆశ్చర్య చకితులను చేసేలా ఉంటాయని చెబుతున్నారు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే ఈ సినిమా అల్లు అర్జున్ కెరియర్లోనే ప్రత్యేకమైనదిగా నిలిచిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాన్ ఇండియా స్థాయి లక్షణాలు ఈ కథలో పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు. ఇక ఈ సినిమాకి సంబంధించిన కసరత్తు ఎప్పుడు పూర్తవుతుందో .. ఎప్పుడు ఎనౌన్సమెంట్ వస్తుందో చూడాలి.ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాను చేస్తున్నాడు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ కథను కూడా పాన్ ఇండియా స్థాయిలోనే వివిధ భాషల్లో విడుదల చేయనున్నారు.ఆ తరువాత సినిమాను ఆయన వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'ఐకాన్' టైటిల్ తో చేయనున్నాడు. ఈ కథకు కూడా పాన్ ఇండియా లక్షణాలు ఉండేలా చూసుకుంటున్నారు. 'పుష్ప' ఫస్టు పార్టుకు .. సెకండు పార్టుకు మధ్య బన్నీ ఈ సినిమా చేస్తాడని అంటున్నారు. ఆ తరువాత మురుగదాస్ ప్రాజెక్టు ఉంటుందనే విషయం అర్థమవుతోంది.

# లేడీ మల్టీస్టారర్ డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ !!



లేడీ సూపర్ స్టార్ నయనతార మరో స్టార్ హీరోయిన్ సమంత కలిసి నటించిన చిత్రం కథు వాకుల రెండు కాదల్. ఈ సినిమాకు నయన్ ప్రియుడు విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించగా స్టార్ నటుడు విజయ్ సేతుపతి కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ట్రయాంగిల్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ సినిమా పై మొదటి నుండి అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా దర్శకుడు విఘ్నేష్ శివన్ సినిమాను చాలా విభిన్నమైన నేపథ్యంలో రూపొందించాడనే వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్ ను ముగించిన చిత్ర యూనిట్ సభ్యులు విడుదల చేసేందుకు సిద్దం అయ్యారు. ఈ సినిమాను మొన్నటి వరకు థియేటర్ లో రిలీజ్ చేయాలనుకున్నారు. కాని ఇంకా పూర్తి స్థాయిలో థియేటర్లు ఓపెన్ కాకపోవడంతో పాటు చాలా సినిమాలు విడుదలకు సిద్దం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ లేడీ మల్టీస్టారర్ సినిమా ఓటీటీ ద్వారా విడుదల చేసేందుకు గాను చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతోంది.సమంత మరియు నయనతారలకు కోలీవుడ్ మరియు టాలీవుడ్ లో మంచి క్రేజ్ ఉంది. అందుకే తెలుగు మరియు తమిళ భాషల్లో రైట్స్ ను ప్రముఖ ఓటీటీ భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు సమాచారం అందుతోంది. ఈ ఇద్దరు హీరోయిన్లు కలిసి నటించిన కథు వాకుల రెండు కాదల్ ను దీపావళి కానుకగా స్ట్రీమింగ్ చేయబోతున్నట్లుగా కూడా సమాచారం అందుతోంది. అనధికారిక సమాచారం ప్రకారం డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఈ సినిమాను స్ట్రీమింగ్ చేసేందుకు గాను ఒప్పందం జరిగిందట. అన్ని అనుకున్నట్లుగా జరిగితే నవంబర్ 4 న స్ట్రీమింగ్ చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. విజయ్ సేతుపతి ఈమధ్య కాలంలో చేసిన సినిమాలు మరియు పాత్రలు సూపర్ హిట్ అవుతున్నాయి. ఆయన నటుడిగా సినిమా సినిమాకు ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ గా మంచి గుర్తింపు దక్కించుకుంటున్నాడు.ఇక ఇద్దరు హీరోయిన్స్ విషయానికి వస్తే నటన మరియు అందం విషయంలో ఇద్దరు కూడా పోటీ పడి మరీ నటిస్తారు. అలాగే సినిమాలో కూడా ఒక వ్యక్తి ప్రేమ కోసం పోటీ పడతారని.. ఇద్దరి మధ్య ఉండే సన్నివేశాలు గతంలో ఎప్పుడు చూడని విధంగా ఉంటాయని తమిళ మీడియా వర్గాలతో విఘ్నేష్ శివన్ అన్నట్లుగా తెలుస్తోంది. సినిమా షూటింగ్ ను కరోనా టైమ్ లోనే ముగించారు. మొత్తంగా సినిమా షూటింగ్ ను ముగించిన చిత్ర యూనిట్ సభ్యులు మరీ ఆలస్యం చేయకుండా థియేటర్ రిలీజ్ కు వెయిట్ చేయకుండా సినిమాను విడుదల చేసేందుకు గాను ఓటీటీ కి ఇవ్వడం జరిగిందని సమాచారం అందుతోంది. ఓటీటీ లో రిలీజ్ కాబోతున్న ఈ సినిమా కోస తెలుగు మరియు తమిళ ఆడియన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నయనతార గత చిత్రాలు కూడా ఓటీటీ ద్వారా విడుదల అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ సినిమా కూడా తప్పకుండా సెంటిమెంట్ తో సక్సెస్ అవుతుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.

# 'బ్యాచ్ లర్'లో పండగలాంటి పిల్ల .. ఫరియా అబ్దుల్లా!



ఈ మధ్య కాలంలో తెలుగు తెరకి పరిచయమైన అందమైన కథానాయికలలో ఫరియా అబ్దుల్లా ఒకరు. 'జాతిరత్నాలు' సినిమా ద్వారా ఈ బ్యూటీ తెలుగు తెరకి పరిచయమైంది. మంచి హైటూ .. .. చక్కని కనుముక్కు తీరు .. ఆకర్షణీయమైన రూపంతో ఆకట్టుకుంది. తెరలు .. తెరలుగా మైకం తెప్పించే మత్తునవ్వు ఈ పిల్ల సొంతం. ప్రభాస్ .. మహేశ్ .. గోపీచంద్ వంటి పొడగరి హీరోల సరసన అయితే ఈ అమ్మాయి బాగుంటుందని అంతా అనుకున్నారు. కానీ ఆ స్థాయిలో ఈ సుందరిని వెతుక్కుంటూ అవకాశాలు వస్తున్నట్టుగా అనిపించడం లేదు.సాధారణంగా పొడగరి అమ్మాయిలు మోడలింగ్ రంగంలో ఎక్కువగా రాణిస్తారు. సినిమాల్లో పొడగరి హీరోల సరసన అవకాశాలు దొరకడం కొంచెం కష్టమైన విషయమే. అందువల్లనే ఆశించిన స్థాయిలో అవకాశాలు లభించవు. జాతిరత్నాలు' భారీ విజయాన్ని సాధించినప్పటికీ ఫరియా అబ్దుల్లా మరో సినిమాలో చోటు దక్కించుకున్న దాఖలాలైతే లేవు. ఈ నేపథ్యంలో ఈ అమ్మాయి 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్' సినిమా ట్రైలర్ లో మెరిసి షాక్ ఇచ్చింది. ఈ అమ్మాయిని చూడగానే ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలవడం ఖాయమని అనుకుంటున్నారు.నిజానికి 'జాతిరత్నాలు' సినిమా విడుదల కావడానికి ముందే ఫరియా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్' సినిమా చేయడానికి అంగీకరించింది. అందువలన అప్పటికి ఫరియాకి హిట్ కానీ .. క్రేజ్ కానీ లేవు. ఈ కారణంగానే ఆ స్థాయికి తగిన పాత్ర చేసి ఉంటుందని అనుకోవాలి. సరే పాత్ర ఏదైతేనేం .. పండుగలాంటి పిల్ల మళ్లీ తెరపై కనిపించడమే పదివేలు అనుకుంటున్నారు. 'దీపం ఎక్కడ పెట్టినా వెలుతురునే గదా ఇస్తుంది' అనుకుంటూ వెయిట్ చేస్తున్నారు. ఇంతగా క్రేజ్ లేనపుడు చేసిన సినిమా కనుక 'బ్యాచ్ లర్' ఫరియాకు ఎంతవరకూ హెల్ప్ అవుతుందనేది చెప్పలేం గానీ ఈ సినిమాకి ఆమె ప్లస్ అవుతుందని బల్లా తన్నేసి మరీ చెప్పచ్చు.అఖిల్ హీరోగా రూపొందిన ఈ సినిమాకి బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించాడు. దసరా పండగ సందర్భంగా అక్టోబర్ 15వ తేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో ప్రధానమైన కథానాయికగా పూజ హెగ్డే అలరించనుంది. ముఖ్యమైన పాత్రలో ఈషా రెబ్బా కనువిందు చేయనుంది. ఈ ఇద్దరు భామలు ట్రైలర్ లో కనిపించినదానికంటే ఫరియా కనిపించినప్పుడు వస్తున్న స్పందన వేరుగా ఉంది. అందువల్లనే ఈ సినిమాకి ఆమె ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.రవితేజ సరసన ఫరియాకి అవకాశం లభించిందనీ .. నాగశౌర్య సినిమా కోసం సంప్రదింపులు జరుపుతున్నట్టుగా ఆ మధ్య వార్తలు వచ్చాయి. కానీ ఆ వార్తల్లో నిజం లేదనే విషయం అర్థమైంది. ఫరియా కెరియర్ ఊపందుకోవాలని ఆమెను అభిమానించే వాళ్లంతా కోరుకుంటున్నారు. కానీ ఆశించిన స్థాయిలో ఆమె ముందుకు వెళ్లలేకపోతోంది. అయితే ఒక బాలీవుడ్ హీరోయిన్ కి ఉండవలసిన లక్షణాలన్నీ ఉండటం వలన ఆమె అక్కడ రాణించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫరియా ఏం చేస్తుందో చూడాలి.

# ఆకట్టుకుంటున్న 'వరుడు కావలెను' చిత్రంలోని 'వడ్డాణం' పాట..!




యంగ్ హీరో నాగ శౌర్య – రీతూ వర్మ జంటగా నటిస్తున్న తాజా చిత్రం "వరుడు కావలెను". దసరా కానుకగా అక్టోబర్ 15న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో శరవేగంగా ప్రమోషన్స్ చేస్తున్న మేకర్స్.. తాజాగా 'వడ్డాణం' అనే పాట లిరికల్ వీడియోని రిలీజ్ చేశారు.'వడ్డాణం చుట్టేసి వచ్చారే భామలు.. వయ్యారం చిందేసే అందాల బొమ్మలు.. పరికిణిలో పడుచును చూస్తే పందిరంతా జాతరే.. అయ్యో రామా క్యా కరే..' అంటూ సాగిన ఫన్ అండ్ పెప్పీ సాంగ్ ఆకట్టుకుంటోంది. ఈ గీతానికి ఎస్.ఎస్ థమన్ ట్యూన్ కంపోజ్ చేశారు. గేయ రచయిత రఘురామ్ దీనికి సాహిత్యం అందించారు.'వడ్డాణం' పాటను ప్రస్తుతం టాలీవుడ్ లోని ప్రముఖ యువ సింగర్స్ అందరూ కలిసి ఆలపించడం విశేషం. గీతా మాధురి – ఏఎల్ గాయత్రి – అదితి భావరాజు – శృతి రంజని ఈ పాట పాడారు. వీరితో పాటుగా శ్రీకృష్ణ మరియు సత్య యామిని – సాహితీ – మనీషా – శ్రీనిధి – రవళి – అభిఖ్య వంటి వారు గొంతు కలిపారు.పెళ్లి వేడుక నేపథ్యంలో వచ్చే ఈ 'వడ్డాణం' పాటకు బృంద మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఇందులో హీరోహీరోయిన్లతో పాటుగా ఇతర మహిళా ప్రధాన తారాగణం అంతా పాల్గొన్నారు. ఈ సాంగ్ కోసం చేసిన ప్రొడక్షన్ డిజైనింగ్ కూడా బాగుంది. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి వచ్చిన పాటల తరహాలోనే 'వడ్డాణం' గీతం కూడా శ్రోతలను అలరిస్తోంది.'వరుడు కావలెను' చిత్రంలో 'కోల కళ్ళే' 'మనసులోనే నిలచిపోకే' పాటలకు విశాల్ చంద్ర శేఖర్ స్వరాలు సమకూర్చారు. 'దిగు దిగు దిగు నాగ' 'వడ్డాణం' పాటలకు థమన్ ట్యూన్స్ అందించారు. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రూపొందుతోన్న ఈ చిత్రంతో లక్ష్మీ సౌజన్య అనే డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ నిర్మాత. ఈ చిత్రంలో నదియా – మురళీశర్మ – వెన్నెల కిశోర్ – ప్రవీణ్ – హర్ష వర్ధన్ – హిమజ – రజిత తదితరులు ఇతర పాత్రలు పోషించారు. వంశీ పచ్చిపులుసుల – విష్ణు శర్మ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించారు. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్ గా.. నవీన్ నూలి ఎడిటర్ గా వర్క్ చేశారు. లవ్ ఫన్ అండ్ ఎమోషన్స్ కలబోసిన కుటుంబ కథా చిత్రం "వరుడు కావలెను" ప్రేక్షకులను ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com